PRGI NO TGTEL/26/A2948

జ్యోతి శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్ ‖ సంపుటి:1 ‖ సంచిక: 24 ‖ మంగళవారం ‖ 23-6-2026 ‖ పేజీలు: 8 ‖ వెల 3/-

జైత్ర
మల్టీ స్పెషాలిటీ
హాస్పిటల్



# రెండు లక్షల మందితో రైతు భరోసా సభ

## ఏర్పాట్లను పరిశీలించిన భట్టి విక్రమార్క

### మధిరలో ఈ నెల 30న నిధుల విడుదల

రాష్ట్రంలోని రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా నిధులను విడుదల చేసే కార్యక్రమానికి మధిర నియోజకవర్గం వేదిక కానుంది. ఈ నెల 30న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రాష్ట్రవ్యాప్తంగా రైతుల ఖాతాల్లోకి ఒకే క్లిక్ ద్వారా రైతు భరోసా నిధులు జమ చేయనున్న నేపథ్యంలో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.



## ఒకే ఇంట్లో నలుగురు ఆత్మహత్య

**నల్గొండ, జూన్ 22**

నల్గొండలో విషాదం చోటుచేసుకుంది. ఓ ఇంట్లో నలుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. పట్టణంలోని సాగర్ రోడ్డు తెలంగాణ కాలనీలో ఈ ఘటన జరిగింది. ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. నాలుగు రోజుల క్రితమే వారు చనిపోయి ఉంటారని అనుమానిస్తున్నారు. మృతుల్లో ఇద్దరిని భార్యాభర్తలు ఎండీ సుల్తాన్, హసీనాగా గుర్తించారు. మరో ఇద్దరి వివరాలు తెలియాల్సి ఉంది. పట్టణంలోని ప్రకాశం బజార్‌లో సుల్తాన్ బ్యాగుల వ్యాపారం చేస్తుండగా.. హసీనా ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నారు. వీరి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## విద్యుదాఘాతంతో భార్యాభర్తలు మృతి

**బోధన్, జూన్ 22**

నిజామాబాద్ జల్లా బోధన్ మండలం ఉట్‌పల్లిలో విషాదం చోటుచేసుకొంది. దంపతులు జ్యోతి, సంజీవ్‌లు ఉతికిన దుస్తులు ఆరేస్తుండగా.. విద్యుత్తు తీగలు తగలడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వారి మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు.



రాష్ట్ర ప్రభుత్వం పంటల కొనుగోళ్ల విషయంలో రైతులకు అన్యాయం చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావు ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు రైతుల్లో తీవ్ర ఆందోళనకు కారణమవుతున్నాయని విమర్శించారు.



# కాంగ్రెస్ పాలనలో సంక్షోభం

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి.రామారావు

### రైతు వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటోందన్న ఆరోపణ

**హైదరాబాద్, జూన్ 22**

రైతుల పంటల కొనుగోళ్లపై ప్రభుత్వం స్పష్టమైన విధానం ప్రకటించకుండా అయోమయ పరిస్థితి సృష్టి స్తోందని కేటీఆర్ అన్నారు. రైతుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని (మిగతా 2వ పేజీలో)

## ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టును భారీగా అభివృద్ధి చేయాలి

### కార్గో, హ్యాంగర్, మరమ్మతు కేంద్రాల ఏర్పాటుకు విజ్ఞప్తి

లోపలి పేజీల్లో..



# రాజ్యాధికార సమరభేరికి సన్నాహాలు

### టీఆర్‌పీ నాయకులతో తీన్మార్ మల్లన్న భేటీ

### భువనగిరి సభ విజయవంతంపై దిశానిర్దేశం

### 16 మండలాల అధ్యక్షులకు నియామక పత్రాల అందజేత

**హైదరాబాద్, జూన్ 22**

తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న యాదాద్రి భువనగిరి జిల్లా పార్టీ నాయకులతో హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయ ంలో సమావేశమయ్యారు. జిల్లా అధ్యక్షుడు కొమ్మరిశెట్టి నరసింహులు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి జిల్లాలోని 16 మండలాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జూలై 5న భువనగిరి జిల్లా కేంద్రంలో నిర్వహిం చనున్న "రాజ్యాధికార (మిగతా 2వ పేజీలో)



## చెల్పూర్ ఘటనపై సమగ్ర విచారణ


### భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక నివేదిక

### ప్రభుత్వం తీవ్రంగా పరిగణించిందన్న మంత్రి పొన్నం ప్రభాకర్

### భవిష్యత్తులో ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు

**హైదరాబాద్, జూన్ 22**

భూపాలపల్లి జిల్లా చెల్పూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాద ఘటనను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణించిందని రవా ణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలి పారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థి తులు, వాస్తవాలను సమగ్రంగా తెలుసు కోవడంతో పాటు (మిగతా 2వ పేజీలో)






తెలంగాణలోని పలు జిల్లాల్లో ఐదు రోజుల పాటు అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. ఇవాళ నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి, భూపాలపల్లి, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. మంగళవారం జగిత్యాల, సిరిసిల్ల, కామారెడ్డి, మెదక్, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో భారీ వర్షాలు పడే వీలుందని పేర్కొంది. నైరుతి రుతుపవనాలు, ద్రోణి ప్రభావంతో వర్షాలు పడే సూచనలు ఉన్నాయని తెలిపింది. మరో వైపు ఏపీలో రాగల మూడు గంటల్లో పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్‌జైన్ తెలిపారు. ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశామన్నారు. పలు జిల్లాల్లో ఈదురు గాలులతో వర్షం, పిడుగులు పడే అవకాశముందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# నేటి రాశి ఫలాలు

**మేషం :** పట్టుదలతో శ్రమిస్తే అనుకున్న పనులు సత్ఫలితాలను ఇస్తాయి. ఉద్యోగంలో ఒత్తిడులు ఉన్నప్పటికీ ఆత్మవిశ్వాసంతో వాటిని అధిగమించగలరు. వ్యాపార రంగంలో తొందరపాటు నిర్ణయాలు పనికిరావు, అలాగే ఆర్థికంగా ఖర్చులు నియంత్రించుకోవడం ఎంతో అవసరం. ఈ రోజు నవగ్రహ ధ్యానం చేయడం శుభకరం.

**వృషభం :** గ్రహచార అనుకూలత వల్ల ప్రారంభించిన పనులు వేగంగా పూర్తవుతాయి. ఉద్యోగంలో పదోన్నతులు, ఉన్నతాధికారుల నుంచి ఆశించిన గౌరవం లభిస్తాయి. మిత్రుల సహకారంతో వ్యాపార రంగంలో మంచి ధనలాభాలు సాధిస్తారు. శ్రీలక్ష్మీదేవిని ఆరాధించడం వల్ల మరింత మేలు జరుగుతుంది.

**మిథునం :** బాధ్యతలను సకాలంలో పూర్తి చేయడం వల్ల ఉన్నతాధికారుల నుంచి గుర్తింపు లభిస్తుంది. వ్యాపారంలో ముందస్తు వ్యూహాలు ఆశించిన లాభాలను తెచ్చిపెడతాయి. ఆర్థికంగా కొత్త అవకాశాలు కలిసి వస్తాయి, కాబట్టి వివాదాలకు దూరంగా ఉండడం మంచిది. విష్ణు సహస్రనామ పఠనం శుభప్రదం.

**కర్కాటకం :** మనోధైర్యంతో ముందడుగు వేస్తే లక్ష్యాలను సులభంగా చేరుకుంటారు. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. ఉద్యోగంలో శుభ ఫలితాలు ఉంటాయి. వ్యాపార సంబంధ విషయాల్లో ఏకాగ్రత అవసరం, కుటుంబ సభ్యుల సలహాలు మేలు చేస్తాయి. శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆరాధన శ్రేయస్కరం.

**సింహం :** ప్రస్తుతం అదృష్ట కాలం నడుస్తోంది, మీ కష్టానికి తగిన ప్రతిఫలం లభిస్తుంది. ఉద్యోగంలో కీర్తి ప్రతిష్టలు, ఆదాయ వనరులు క్రమంగా పెరుగుతాయి. ఇతరుల ప్రవర్తన ఇబ్బంది పెట్టినప్పటికీ శాంతంగా, ఓర్పుతో వ్యవహరించాలి. శ్రీలక్ష్మీ ధ్యానం శుభ ఫలితాలను ఇస్తుంది.

**కన్య :** గురుబలం అనుకూలంగా ఉండడం వల్ల ధైర్యంగా నిర్ణయాలు తీసుకోవచ్చు. ఉద్యోగంలో పూర్వపు శ్రమకు తగిన గుర్తింపు, ఆదాయ వృద్ధి లభిస్తాయి. వ్యాపారంలో ఆటంకాలను సహనంతో అధిగమిస్తారు, ప్రయాణాల్లో జాగ్రత్త అవసరం. నవగ్రహ శ్లోకాలు పఠించడం ఎంతో మంచిది.

**తుల :** పనులను వాయిదా వేయకుండా పట్టుదలతో పూర్తి చేస్తే విజయాలు లభిస్తాయి. వ్యాపారంలో సరైన వ్యూహాలు అనుకూల లాభాలను తెచ్చిపెడతాయి. సవాళ్లు ఎదురైనప్పటికీ కుటుంబ సభ్యుల సూచనలతో అధిగమించగలరు. నవగ్రహ ధ్యానం శుభప్రదం.


**వృశ్చికం :** శుభ యోగం కారణంగా ఉద్యోగంలో మంచి ప్రశంసలు, లబ్ధి చేకూరుతాయి. గృహ, వాహన కొనుగోలు ప్రయత్నాలు అనుకూలిస్తాయి. వ్యాపారంలో చిన్నపాటి ఇబ్బందులు ఉన్నా ధైర్యంగా అధిగమించి లాభాలు పొందుతారు. శ్రీలక్ష్మీ ఆరాధన శ్రేయస్సును పెంచుతుంది.

**ధనుస్సు :** ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే విజయం మీకు చేరవవుతుంది. సమాజంలో గౌరవ మర్యాదలు, ఉద్యోగంలో మంచి గుర్తింపు లభిస్తాయి. వ్యాపారంలో ఇబ్బందులను తెలివిగా పరిష్కరిస్తారు, కుటుంబ సభ్యుల సహకారం ఉంటుంది. శ్రీలక్ష్మీ ధ్యానం శుభకరం.

**మకరం :** ఏకాగ్రతతో పనిచేస్తే అనుకున్న లక్ష్యాలను సులభంగా సాధించగలుగుతారు. ఉద్యోగ, ఆర్థిక విషయాల్లో ఆలోచించి తగిన నిర్ణయాలు తీసుకోవాలి. వ్యాపార పెట్టుబడుల విషయంలో లాభ సూచనలు కనిపిస్తున్నాయి. శ్రీసూర్యనారాయణ స్వామి స్మరణ మేలు చేస్తుంది.

**కుంభం :** ముఖ్యమైన వ్యవహారాల్లో అప్రమత్తత అవసరం, కొత్త ప్రయత్నాలు వాయిదా వేయడం మంచిది. ఉద్యోగ బాధ్యతలను సమయానికి పూర్తి చేయడంపై దృష్టి పెట్టాలి. ఆస్తి, ధన విషయాలలో శాంతంగా, సమష్టిగా నిర్ణయాలు తీసుకోవడం మంచిది. నవగ్రహ శ్లోకాలు శుభప్రదం.

**మీనం :** అదృష్టం తోడుగా ఉండడం వల్ల ఉద్యోగంలో పురోగతి, ప్రశంసలు లభిస్తాయి. వ్యాపారంలో కొత్త అవకాశాలు, పెట్టుబడులు లాభదాయకంగా మారుతాయి. గృహంలో శుభకార్యక్రమాలు జరిగే సూచనలు ఉన్నాయి, ఆస్తి కలిసి వస్తుంది. శ్రీలక్ష్మీ అష్టోత్తరం పఠించడం శ్రేయస్కరం.



# రెండు లక్షల మందితో రైతు భరోసా సభ

**ఖమ్మం, జూన్ 22**

సభ నిర్వహణ కోసం చింతకాని మండలంలో అనువైన స్థలాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్‌తో కలిసి ఆదివారం పరిశీలించారు. సభా ప్రాంగణ ఏర్పాట్లు, ప్రజల రాకపోకలు, పార్కింగ్, భద్రత, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలపై అధికారులతో క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించారు.రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రైతులకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల్లో రైతు భరోసా కీలకమని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా లక్షలాది మంది రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. మధిర చరిత్రలోనే ఎన్నడూ లేని స్థాయిలో ఈ సభను నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. సుమారు రెండు లక్షల మంది రైతులు, ప్రజలు హాజరయ్యేలా కాంగ్రెస్ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని పార్టీ నాయకులకు సూచించారు.సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమిష్టిగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. భద్రతా ఏర్పాట్లతో పాటు రవాణా, వైద్య, పారిశుధ్య సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని, రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమాన్ని చారిత్రాత్మకంగా



నిర్వహించనున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



# పంటల కొనుగోళ్లపై రైతుల్లో ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సంక్షేమ కార్యక్రమాలు అమలయ్యాయని, ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. రెండున్నర సంవత్సరాల కాలంలో రాష్ట్ర అభివృద్ధికి చెప్పుకోదగ్గ కార్యక్రమాలు చేపట్టలేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే కేంద్ర ప్రభుత్వ సూచనలకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. రైతుల ప్రయోజనాలను కాపాడే విధంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.పార్టీ కార్యకర్తలు, నాయకులపై వేధింపులు జరుగుతున్నాయని ఆరోపించిన కేటీఆర్, అలాంటి చర్యలను బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని చెప్పారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతంతో పాటు కార్యకర్తల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తానని కేటీఆర్ తెలిపారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని, రైతుల పక్షాన నిలబడుతుందని స్పష్టం చేశారు.

# అర్జీల పరిష్కారంలో మానవీయ దృక్పథం అవసరం

## అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

**అమరావతి, జూన్ 22**

ప్రజల నుంచి వచ్చే అర్జీలు, ఫిర్యాదులను మానవీయ కోణంలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రజలకు సేవలందించే ప్రతి ఉద్యోగి, అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి సోమవారం వివిధ శాఖల పనితీరుపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రజా సేవల అమలు, ఫిర్యాదుల పరిష్కారం, పరిపాలనా వ్యవస్థ పనితీరుపై అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా ప్రజల సమస్యలను కేవలం పరిపాలనా అంశాలుగా కాకుండా మానవీయ కోణంలో చూడాల్సిన అవసరం ఉందని సీఎం పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రతి పౌరుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ఉద్యోగులు, అధికారులు సాఫ్ట్ స్కిల్స్‌ను



పెంపొందించుకోవాలని సీఎం కోరారు. ప్రజలతో సమర్థవంతంగా సంభాషించడం, సమస్యలను ఓర్పుతో వినడం, త్వరితగతిన స్పందించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత సులభంగా, పారదర్శకంగా అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత గడువులో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీక్షా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# చెల్పూర్ ఘటనపై సమగ్ర విచారణ

(మొదటి పేజీ తరువాయి)

భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుం డా చర్యలు సూచించేందుకు విచారణకు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు.ఈ మేరకు రవాణా కమిషనర్ కార్యాలయంలోని జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎం. చంద్రశేఖర్ గౌడ్‌ను విచారణ అధికారిగా నియమించినట్లు మంత్రి తెలిపారు. ప్రమాదానికి సంబంధించిన అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి నివేదికను వీలైనం త త్వరగా ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు.విధి నిర్వహణలో ఉన్న అధికారుల భద్రత అంశాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోం దని మంత్రి స్పష్టం చేశారు. ఫీల్డ్ స్థాయిలో పనిచేసే అధికారులకు అవసరమైన భద్రతా చర్యలు, రక్షణ ప్రమాణాలపై ప్రత్యేకంగా అధ్యయనం చేయాలని విచారణ అధికారిని ఆదేశించినట్లు వెల్లడించారు. వాహనాల తనిఖీలు, సీజ్ ప్రక్రియలు నిర్వహించే సమయంలో అనుసరించాల్సిన భద్రతా ప్రమాణాలు, కార్యాచరణ విధానాలు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా సమగ్ర నివేదిక ఇవ్వాలని సూచించినట్లు చెప్పారు. ఇటువంటి విధుల్లో పాల్గొనే సిబ్బంది భద్రతకు ఎలాంటి లోటు ఉండకూడదని పేర్కొన్నారు.చెల్పూర్ ఘటనకు దారితీసిన కారణాలను పూర్తిగా విశ్లేషించి, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై స్పష్టమైన సిఫార్సులు చేయాలని మంత్రి ఆదేశించారు.

ప్రమాదాల నివారణకు అవసరమైన మార్గదర్శకాలను రూపొందించనున్నట్లు తెలిపారు. విచారణ నివేదిక అందిన వెంటనే ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రజల భద్రతతో పాటు విధి నిర్వహణలో ఉన్న అధికారుల రక్షణ విషయంలో ప్రభుత్వం రాజీపడబోదని పేర్కొన్నారు.

# ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టును భారీగా అభివృద్ధి చేయాలి

**న్యూఢిల్లీ, జూన్ 22** భారత వాయుసేన ఆధ్వర్యంలో అభివృద్ధి చేయనున్న ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని అన్ని ఆధునిక సౌకర్యాలతో విస్తరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కోరారు. ఢిల్లీలోని రక్షణ శాఖ కార్యాలయంలో జరిగిన భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా మూసీ నది అభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా గాంధీ సరోవర్ నిర్మాణానికి రక్షణ శాఖ భూములను బదలాయించినందు కు ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని ఆయన అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఆదిలాబాద్ విమానాశ్రయ అభివృద్ధికి అవసరమైన భూసేకరణ, విద్యుత్, రహదారులు తదితర మౌలిక సదుపాయాల కల్పనలో పూర్తి సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. దేశ భద్రత, రక్షణ పరంగా కూడా ఈ విమానాశ్రయానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉందని పేర్కొన్నారు.

భారత వాయుసేన టెర్మినల్‌తో పాటు పౌర విమానయాన శాఖకు సంబంధించిన ప్రయాణికుల టెర్మినల్‌ను కూడా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కోరారు. అలాగే సరుకు రవాణా కేంద్రం, విమానాల మరమ్మతు కేంద్రం, హ్యాంగర్ సదుపాయాలను పెద్ద ఎత్తున అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు.ప్రపంచవ్యాప్తంగా విమానయాన రంగంలో మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో అనేక అంతర్జాతీయ విమానయాన సంస్థలు కొత్త హ్యాంగర్ కేంద్రాల కోసం అన్వేషిస్తున్నాయని ముఖ్యమంత్రి వివరించారు. భౌగోళికంగా, వాతావరణ పరంగా ఆదిలాబాద్ ఇందుకు అనుకూలంగా ఉండటంతో ఈ ప్రాంతాన్ని అంతర్జాతీయ స్థాయి విమానయాన కేంద్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. అదేవిధంగా రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థకు చెందిన కీలక ప్రాజెక్టును మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీపంలో ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. ఆ ప్రాజెక్టుకు త్వరితగతిన ఆమోదం తెలిపి రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ..టీఆర్‌పీ నాయకులతో తీన్మార్

(మొదటి పేజీ తరువాయి)

సమరభేరి" సభ ఏర్పాట్లపై విస్తృతంగా చర్చించారు. సభను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచర ణ, జనసమీకరణ, ప్రచార కార్యక్రమాలు, నిర్వహణ ఏర్పా ట్లపై నాయకులకు తీన్మార్ మల్లన్న దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో పార్టీ విస్తరణకు ఇలాంటి సభలు కీలకమని పేర్కొన్న ఆయన, ప్రతి నాయకుడు బాధ్యతగా పనిచేసి సభ విజయవంతానికి కృషి చేయాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణంపై కూడా సమావేశంలో సమీక్ష నిర్వహించారు. ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి వాటి పరిష్కారం కోసం పోరాడాలని నాయకుల కు సూచించారు.పార్టీ సిద్ధాంతాలు, లక్ష్యాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని అన్నారు.అనంతరం నూత నంగా నియమి తులైన మండల అధ్యక్షులకు నియామక పత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.పార్టీ అభివృ ద్ధికి కట్టుబడి పనిచేయాలని వారికి సూచించారు. సమావే శంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్లబోయిన ఓదెలు యాదవ్, రాష్ట్ర కార్యదర్శి పసల ప్రసన్న కుమారి, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బందారపు నరసయ్య గౌడ్‌తో పాటు యాదాద్రి భువనగిరి జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. జూలై 5న జరిగే రాజ్యాధికార సమరభేరి సభను విజయవంతం చేసేందుకు సమిష్టిగా కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

జ్యోతి శ్వేత

సంపాదకీయం

ఆదివారం 14-6-2026

# ఎల్‌నినో కార్యాచరణ ఏదీ?

ఎల్‌నినో హెచ్చరికల నేపథ్యంలో పాలకులు అప్రమత్తం కావాల్సి ఉంది. ముఖ్యంగా సాగు, తాగునీరుతో పాటు, వ్యవసాయ విధానంపై ప్రణాళికలు ఇప్పటికే సిద్ధం కావాల్సి ఉండగా అలాంటిదేమీ కనిపించడం లేదు. ఇప్పుడు దీని ప్రభావంతో భారతదేశానికి కరువు కాలం కమ్ముకొస్తుంది. దీనిపై ప్రజలను రైతులను అప్రమత్తం చేయడంతో పాటు, కార్యాచరణకు సిద్ధం కావాల్సి ఉంది. నైరుతి రుతు పవనాల రాకతో వర్షాలు పడతాయి.. వ్యవసాయం బాగుంటుందని ఆశిస్తున్న రైతులకు ఇది అశనిపాతం లాంటిదే. ఎల్ నినో వచ్చేసిందని.. ఈ రుతు పవనాల సమయంలో అది మరింత బలపడుతుందని భాతర వాతావరణ శాఖ అధికారికంగా ప్రకటించింది. ఇదే సమయంలో ఎల్ నినో ప్రారంభం అయినట్లు జపాన్ వాతావరణ సంస్థ జూన్ 11వ తేదీన అధికారికంగా ప్రకటించటం విశేషం. పసిఫిక్ సముద్రం ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగటాన్ని ఎల్ నినో అంటారు. సముద్ర ఉపరితల జలాల ఉష్ణోగ్రత సహజంగా 3.4 డిగ్రీలుగా ఉ ంటుంది. ఇప్పుడు అది పాయింట్ 5 శాతం పెరిగింది. అంటే సముద్రం నీరు ఉండాల్సిన వేడి కంటే అధిక వేడిగా ఉన్నాయి. దీన్ని ఎల్‌నినో అంటారు. జూన్ నుంచి ఆగస్ట్ మధ్య కాలంలో ఎల్‌నినో మరింత బలపడుతుందని వాతావరణ శాఖ వెల్లడించింది. జూలై మధ్య నుంచి తూర్పు పసిఫిక్ అంతటా విస్తరిస్తుందని.. ఇదంతా రుతు పవనాల కాలంలోనే జరుగుతుందని వాతావరణ శాఖ నివేదిక స్పష్టం చేస్తుంది. సహజంగా నైరుతి రుతు పవనాల సీజన్ లో చల్లటి వాతావరణంతోపాటు నికరంగా వర్షాలు పడతాయి. ఎల్‌నినో ప్రభావంతో సముద్రం నీరు వేడెక్కటం వల్ల సముద్రం నుంచి భూమిపైకి వేడి గాలులు వీస్తాయి. భూమిపై ఎక్కువగా పొడి వాతావరణం ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వర్షపాతం తక్కువగా ఉంటుంది. దీంతో కరువు వస్తుంది. దీనికితోడు అక్కడక్కడ కుండపోత వర్షాలు ఉంటాయి. క్లౌడ్ బరస్టులు ఉంటాయి. దీని వల్ల విపత్తులు వచ్చే ప్రమాదం ఉంది. వర్షాలు తక్కువగా ఉండటం వల్ల నీళ్ల కొరత ఏర్పడుతుంది. మంచి నీళ్లకు.. సాగునీటికి ఇబ్బందులు తలెత్తుతాయి. వ్యవసాయానికి అవసరం అయిన నీళ్లు లేక పంటలు పండవు. ఆదాయం లేక రైతులు, రైతు కూలీలకు ఇబ్బంది వస్తుంది. ఎల్‌నినో అధికారంగా ప్రారంభం అయిన భారత వాతావరణ శాఖ ప్రకటనతో ప్రభుత్వాలు, ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. రైతులు పంటలు సాగు చేసే విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అన్నింటికి మించి పంటలకు సంబంధించి ఆరుతడి పంటలకు రైతులను ప్రోత్సాహించాలి. సాగునీటి లభ్యత తక్కువగా ఉంటుంది కాబట్టి, వరి లాంటి పంటలకు రైతులు దూరంగా ఉండాలి. మనకున్న వనరులను దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా కార్యాచరణ సిద్ధం చేయాలి. ఎల్‌నినోకు కారణం ఓ రకంగా చెప్పాలంటే పర్యావరణ విధ్వంసమే. మన చేజేతులా పర్యావరణ విధ్వంసానికి పాల్పడిన పాపానికి విపరీత వాతావరణ పరిస్థితులు ఎదుర్కోబోతున్నాం. వాతావరణ మార్పు, పర్యావరణ వ్యవస్థ నష్టం, భూమి ఎడారీకరణ వంటి తీవ్రమైన పరిణామాలతో మానవ-ప్రేరిత పర్యావరణ నష్టం పెరుగుతుంది. పర్యావరణాన్ని పరిరక్షించడం, భూమి మరియు ప్రకృతిని వాటి సహజ స్థితికి పునరుద్ధరించడం ఇప్పుడు అంరి తక్షణ కర్తవ్యం కావాలి. భూమిని రక్షించడానికి, పునరుద్ధరించడానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి. పర్యావరణ విధ్వంసం నిరంతరంగా సాగడంవ వల్ల మన భూమి భవిష్యత్తు ప్రమాదంలో పడింది. ఎడారీకరణ, భూమి క్షీణత, కరువు అనేది మన కాలంలోని అత్యంత ముఖ్యమైన పర్యావరణ సవాళ్లలో ఒకటి. ఇటీవలే జూన్ 5న

ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకున్నాం. అయినా మనలో మార్పు కానరావడం లేదు. చెరువులను మింగేస్తున్నాం. ప్లాస్టిక్ భూతాన్ని భూమిపైకి వదిలేస్తున్నాం. మన పర్యావరణాన్ని రక్షించడానికి

ప్రపంచవ్యాప్త అవగాహన, కార్యాచరణను ప్రోత్సహించడానికి మాటలతో సరిపెడుతున్నాం. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పర్యావరణంపై దృష్టి సారించి, ఏటా చర్యలు తీసుకుని ఉంటే ఇలాంటి ఎల్‌నినో ప్రభఆవాలు వచ్చే వచ్చేవి కావు. ఇప్పటికైనా మనమంతా భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువును తట్టుకునే శక్తి, పద్ధతులపై దృష్టి సారించాలి. మన భవిష్యత్తు, మన తరం, భూమి పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వాలు ఆ వైపు కార్యాచరణను రూపొందించి కచ్చితంగా అమలు చేయాలి. పర్యావరణ శాస్త్రవేత్తలు, ప్రేమికులు, సైన్సు సంస్థలు ఎల్‌నినో దుష్ఫలితాలపై విస్తృతంగా ప్రచారంనిర్వహించాలి. ప్రజలకు అవగాహన కల్పించాలి. ముఖ్యంగా యువతను ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలి. ద ఈ నిని ప్రజా ఉద్యమంగా దిశా నిర్దేశం చేయాలి. అన్ని పర్యావరణ పరిరక్షణ సంస్థలు, వ్యక్తులు ఒక ఉద్యమంలా ఐక్యంగా పనిచేయడం ద్వారా ధరిత్రిని కాపాడుకోవాలి. ఈ క్రమంలో తక్షణంగా ప్రస్తుత విపత్తును తట్టుకునే కార్యాచరణకు రంగం సిద్ధం చేయాలి. కేంద్రం తక్షణమే రాష్ట్రాలతో సంప్రతింపులు జరిపి వ్యయసాయ స ంక్షోభ నివారణకు చర్యలు తీసుకోవాలి. తాగునీటి సమస్యపైనా చర్చించాలి.

# మైలవరంలో మట్టి మాఫియా

కలెక్టరేట్ లో జోగి రమేష్ ఫిర్యాదు

అమరావతి, జూన్ 22: మైలవరం నియోజకవర్గంలో కొనసాగుతున్న మట్టి అక్రమ తవ్వకాలు, అక్రమ రవాణాపై మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు జోగి రమేష్ సోమవారం విజయవాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. మైలవరం నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో అనుమతులు లేకుండా భారీ ఎత్తున మట్టిని తవ్వి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని, ఈ అక్రమ వ్యవహారం వల్ల ప్రభుత్వానికి కోట్ల రూపాయల మేర ఆదాయ నష్టం వాటిల్లుతోందని ఆయన ఆరోపించారు. అంతేకాకుండా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని, వ్యవసాయ భూములు సాగుకు అనువుగా లేకుండా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కలెక్టర్‌కు సమర్పించిన ఫిర్యాదులో మట్టి తవ్వకాల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు, కాలువలు, వ్యవసాయ భూములు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని పేర్కొన్నారు. అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలు అధిక లోడుతో రహదారులపై సంచరిస్తుండటంతో గ్రామీణ రహదారులు దెబ్బతింటున్నాయని, ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ అక్రమ తవ్వకాలపై స్థానికులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు.అనంతరం మీడియాతో మాట్లాడిన జోగి రమేష్, మట్టి అక్రమ రవాణా వెనుక అధికార పార్టీకి చెందిన కొందరు ప్రజాప్రతినిధులు, నాయకుల అండదండలు ఉన్నాయని ఆరోపించారు. అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ అక్రమాలు నిరాటంకంగా కొనసాగుతున్నాయని విమర్శించారు. స్థానిక రెవెన్యూ, గనుల శాఖ, పోలీసు అధికారుల సమన్వయ లోపం కారణంగా మట్టి మాఫియా మరింత రెచ్చిపోతోందని పేర్కొన్నారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను అధికారులు పట్టించుకోవడం లేదని, అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మౌనంగా ఉ ండటం అనుమానాలకు తావిస్తోందని అన్నారు. మైలవరం ప్రాంతంలో జరుగుతున్న మట్టి దోపిడీపై జిల్లా స్థాయి ఉన్నతాధికారులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సమగ్ర విచారణ జరపాలని జోగి రమేష్ డిమాండ్ చేశారు. అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, అక్రమ రవాణాకు ఉ పయోగిస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకోవాలని కోరారు. పర్యావరణానికి, వ్యవసాయ రంగానికి నష్టం కలిగించే ఇటువంటి కార్యకలాపాలను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైతే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఫిర్యాదును స్వీకరించిన జిల్లా కలెక్టరేట్ అధికారులు సంబంధిత శాఖల ద్వారా విషయాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిసింది.

### నేటి నుంచి పులివెందులలో


## వైఎస్ జగన్ పర్యటన

పులివెందుల, జూన్ 22: వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేటి నుంచి జూన్ 25 వరకు తన సొంత నియోజకవర్గమైన పులివెందులలో పర్యటించనున్నారు. సాయంత్రానికి పులివెందుల చేరుకోనున్న ఆయన, తన క్యాంప్ కార్యాలయంలో స్థానిక నేతలు, కార్యకర్తలతో సమీక్షలు జరపడంతో పాటు ప్రజలను నేరుగా కలుసుకుని సమస్యలు తెలుసుకునేందుకు 'ప్రజాదర్బార్' నిర్వహించనున్నారు. పర్యటనలో భాగంగా రెండో రోజైన జూన్ 24 ఉ దయం వేముల మండలం భూమయ్యగారిపల్లిలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో జరిగే ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నానికి మళ్లీ క్యాంప్ ఆఫీస్‌కు చేరుకుని, ఉమ్మడి కడప జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే బాధితుల నుంచి అర్జీలను స్వీకరిస్తూ పార్టీ శ్రేణులతో ముఖాముఖి మాట్లాడనున్నారు. ఈ మూడు రోజుల నియోజకవర్గ పర్యటన ముగించుకుని జూన్ 25వ తేదీ గురువారం ఉదయం ఆయన తిరిగి ప్రయాణమవుతారు.

# ఆంధ్రప్రదేశ్‌లో ఆధ్యాత్మిక పునరుజ్జీవనం

### రెండేళ్ల కూటమి పాలనలో దేవాదాయ శాఖ విప్లవాత్మక విజయాలు!

### ఆలయాల అభివృద్ధి, అర్చకుల సంక్షేమానికి పెద్దపీట



అమరావతి, జూన్ 22: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా దేవాదాయ శాఖ సాధించిన ప్రగతి, సంస్కరణలపై మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సచివాలయంలో ఉ న్నతాధికారులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వంలో దెబ్బతిన్న హిందూ భక్తుల విశ్వాసాన్ని పునరుద్ధరిస్తూ, ఏపీని దేశంలోనే ఆధ్యాత్మిక ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని మంత్రి ప్రకటించారు. ఇందులో భాగంగా 6,137 దేవాలయాలకు ధూపదీప నైవేద్య పథకం వార్షిక వ్యయాన్ని రూ.35 కోట్ల నుంచి రూ.73 కోట్లకు రెట్టింపు చేశామన్నారు. నిర్లక్ష్యానికి గురైన 692 పురాతన ఆలయాల అభివృద్ధికి రూ.813 కోట్ల సర్వశ్రేయోనిధి నిధులు మంజూరు చేయడంతో పాటు, టీటీడీ సహకారంతో రూ.750 కోట్ల వ్యయంతో 5,000 శ్రీవాణి భజన మందిరాల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటికే 1,270 మందిరాలకు రూ.267 కోట్లు కేటాయించామని వెల్లడించారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌ను దేవాదాయ శాఖలో విలీనం చేసి అర్చక, వేద పరిరక్షణకు సరికొత్త దిశను చూపించామని స్పష్టం చేశారు.

### పరిపాలనలో డిజిటల్ విప్లవం..

### భూములకు బ్లాక్‌చెయిన్ రక్షణ

దేవాలయాల పరిపాలనలో పారదర్శకత, జవాబుదారితనం పెంచేందుకు సరికొత్త సాంకేతికతను తీసుకొచ్చినట్లు మంత్రి వివరించారు. రాష్ట్రంలోని 22,672 దేవాలయాలకు చెందిన 4.48 లక్షల ఎకరాల భూముల రక్షణ కోసం 'బ్లాక్‌చెయిన్ ఆధారిత డిజిటలైజేషన్' ప్రక్రియను ప్రారంభించామన్నారు. టెంపుల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ంమీా)తో పాటు భక్తుల సౌకర్యార్థం ప్రవేశపెట్టిన "మన మిత్ర" వాట్సాప్ సేవలు అద్భుత ఫలితాలు ఇస్తున్నాయని, జనవరిలో కేవలం 840 లావాదేవీలతో ప్రారంభమైన ఈ సేవలు, మే నాటికి 1.93 లక్షల లావాదేవీలతో సరికొత్త రికార్డు సృష్టించాయని తెలిపారు. అలాగే 970 దేవాలయాలకు నూతన ట్రస్ట్ బోర్డులను ఏర్పాటు చేశామని, సామాజిక సమతుల్యత కోసం ప్రతి బోర్డులోనూ బ్రాహ్మణ, నాయీబ్రాహ్మణ వర్గాలకు తప్పనిసరిగా ప్రాతినిధ్యం కల్పించామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు.

### పెరిగిన భక్తుల విశ్వాసం.. మహాకుంభమేళా స్థాయిలో 2027 పుష్కరాలు

కూటమి ప్రభుత్వ సంస్కరణల వల్ల గత రెండేళ్లలో రాష్ట్రంలోని ప్రధాన ఆలయాలను దర్శించుకునే భక్తుల సంఖ్య రికార్డు స్థాయిలో 70 శాతం పెరిగిందని మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం 111 దేవాలయాల్లో ఉచిత అన్నప్రసాద వితరణ ద్వారా ఏడాదికి 3 కోట్ల మంది భక్తులకు భోజన సదుపాయం కల్పిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని 22 ప్రధాన దేవాలయాలకు మాస్టర్ ప్లాన్లు రూపొందిస్తూ ఆధ్యాత్మిక మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నామన్నారు. టీటీడీలో ఏఐ ఆధారిత కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పారదర్శకత పెంచామని.. రాబోయే 2027 గోదావరి పుష్కరాలను మహాకుంభమేళా స్థాయిలో నిర్వహించేందుకు తొలి దశలోనే రూ.71.60 కోట్లతో 162 పనులను ప్రారంభించామని, విధ్వంసం నుంచి వికాసం వైపు దేవాదాయ శాఖ అడుగులు వేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

# రెండేళ్లలో రవాణా రంగంలో విప్లవాత్మక మార్పు

### స్త్రీ శక్తి నుంచి ఈ-బస్సుల వరకు ఏపీఎస్‌ఆర్టీసీకి నూతన దిశ

### రవాణా శాఆఖపై రెండేళ్ల నివేదిక వివరించిన మంత్రి మండిపల్లి



అమరావతి, జూన్ 22: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా శాఖ (ఘ్రాణ), ఘ్రా ాజలలో విప్లవాత్మక సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. అమరావతి సచివాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజా రవాణాలో సంక్షేమం, సాంకేతికత, పారదర్శకతకు పెద్దపీట వేసినట్లు పేర్కొన్నారు. మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రవేశపెట్టిన 'స్త్రీ శక్తి' పథకం ద్వారా ఇప్పటివరకు 73.62 కోట్ల మంది, 'దివ్యాంగ శక్తి' ద్వారా 38.22 లక్షల మంది ఉచిత ప్రయాణ సదుపాయం పొందారని, దీనివల్ల ఆర్టీసీ బస్సుల ఆక్యుపెన్సీ రేషియో 69 శాతం నుంచి 92 శాతానికి పెరిగిందని వెల్లడించారు. ప్రయాణికుల సౌకర్యార్థం బస్ స్టేషన్లలో మౌలిక వసతులు మెరుగుపరచడంతో పాటు.. బస్సుల సమయపాలన, భద్రతను గణనీయంగా పెంచామని, పండుగలు, ప్రత్యేక ఉత్సవాల సేవల ద్వారా రూ.35 కోట్లకు పైగా అదనపు ఆదాయం సాధించామని మంత్రి వివరించారు.

ఆర్థిక క్రమశిక్షణతో పాటు పర్యావరణ హితమైన గ్రీన్ మొబిలిటీ దిశగా ఆర్టీసీ అడుగులు వేస్తోందని మంత్రి తెలిపారు. జూన్ 2024 నుంచి మార్చి 2026 వరకు రూ.1,240 కోట్ల రుణాలు, వడ్డీలు చెల్లించామని, వాణిజ్య విభాగం, లాజిస్టిక్స్ ద్వారా ఆదాయాన్ని గణనీయంగా పెంచామని చెప్పారు. మెకానికల్ విభాగంలో 1,489 కొత్త బస్సులను ప్రవేశపెట్టగా.. పీఎం ఈ-బస్ సేవా కింద 750, తిరుపతికి 300 ఈ-బస్సులు మంజూరయ్యాయని, భవిష్యత్తులో 8,321 ఈ-బస్సులను తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. ప్రయాణికులకు ఆధునిక ఐటీ సేవలు, సమగ్ర మొబైల్ యాప్, వాట్సాప్ సేవలు, యూపీఐ డిజిటల్ చెల్లింపులను అందుబాటులోకి తెచ్చామన్నారు. రవాణా శాఖలో 'వాహన్', 'సారథి' ద్వారా 85 సేవలను ఆన్‌లైన్ చేశామని, 22 జిల్లాల్లో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లు (ఘ్రా), 12 ప్రాంతాల్లో ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్‌లను (ఘ్రాఖు) ఏర్పాటు చేసి లైసెన్స్, ఫిట్‌నెస్ ప్రక్రియల్లో పూర్తి పారదర్శకత తెచ్చామని వివరించారు. రవాణా శాఖ ఆదాయం 2025-26లో రూ.5,050.35 కోట్లకు చేరగా, వాహన విక్రయాలు 9.81 లక్షలకు పెరిగాయని మంత్రి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. ఆటో, టాక్సీ డ్రైవర్లకు 'ఆటో డ్రైవర్ సేవా' పథకం కింద రూ.436 కోట్ల ఆర్థిక సహాయం అందించామని, కొత్త ఎలక్ట్రిక్ వాహనాలకు 5 ఏళ్ల పన్ను మినహాయింపు ఇచ్చి ఊరట కల్పించామన్నారు.




## పరిశ్రమల్లో అక్రమంగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 22

బిస్లరీ ఇంటర్నేషనల్ , మైక్రోబాక్స్ పరిశ్రమల్లో అక్రమంగా తొలగించిన కార్మికులను వెంటనే విధులకు తీసుకోవాలని, కార్మిక చట్టాలు ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోకుండా కార్మిక శాఖ ఎందుకు మెతక వైఖరి అవలంబిస్తున్నదని సిఐటియు జిల్లా అధ్యక్షులు బీరం మల్లేశం అన్నారు..పటాన్చెరువు మండలం ఐడిఏ పాశమైలారం లోని బిస్లరీ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ మరియు కొండాపూర్ మండలం మల్లేపల్లి గ్రామ పరిధిలోని మైక్రోబాక్స్ పరిశ్రమల్లో యూనియన్లు పెట్టుకున్నందుకు కక్షపూర్తంగా యాజమాన్యాలు కార్మికులను అక్రమంగా తొలగించడాని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించడం జరిగింది.. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ గారికి వినతిపత్రం అందజేయడం జరిగింది..ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్ ను రాష్ట్రంలో అమలు కాకంటే ముందే యాజమాన్యాలు దూకుడుగా అమలు చేసేందుకు పునుకుంటున్నాయని అన్నారు.. బిస్లరి పరిశ్రమల్లో యూనియన్ ఏర్పాటు చేశారని కక్షతో 5మందిని మైక్రో బాక్స్ లో 13మందిని కార్మికులను అక్రమంగా తొలగించిందని అన్నారు. ఇది పూర్తిగా చట్ట విరుద్ధమని అన్నారు. పరిశ్రమ యాజమాన్యాలు చట్టాల ఉల్లంఘించి కార్మికుల హక్కులను కాలరాస్తుంటే కార్మిక శాఖ చర్యలు తీసుకోకుండా ఎందుకు మెతక వైఖరి వహిస్తుందని అన్నారు.. తొలగించిన కార్మికులను తక్షణమే భేషరతుగా విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో కార్మికుల కండగా జిల్లాలోని కార్మికులందరి సంఘటితం చేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు..

### ప్రజా పాలనలో కార్మికులకు హక్కులు ఉండవా..?

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బిస్లేరీ యూనియన్ అధ్యక్షులు అతిమేల మానిక్ మాట్లాడుతూ అక్రమ తొలగింపులకు నిరసిస్తూ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గత 12 రోజులుగా కార్మికుల సమ్మె చేస్తుంటే కార్మిక శాఖ అధికారులు ఏమి చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ప్రజా పాలనని చెప్తుందని కానీ ఆచరణలో ఎందుకు భిన్నంగా ఉండాలని అన్నారు.. ప్రజా పాలనలో కార్మికులకు హక్కులు ఉండవని ప్రశ్నించారు.. యూనియన్ పెట్టుకున్నందుకు యాజమాన్యం కక్షపూరితంగా కార్మికులను ఉద్యోగాల నుండి పీకేసిందని అన్నారు.. కార్మిక చట్టాలను అమలు చేయించవలసిన కార్మిక శాఖ నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు. తొలగించిన కార్మికులను వెంటనే తీసుకోవాలని యూనియన్ గుర్తించాలని కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో కలెక్టరేట్ ముట్టడిస్తామని అన్నారు.



## కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీవోస్ సంఘ నాయకులు

సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 22

తెలంగాణ ఎన్‌జీవోస్ (టీఎన్జీవోస్) సంగారెడ్డి జిల్లా సంఘ నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా అధ్యక్షుడు ఎండి. జావిద్ అలీ, జిల్లా కార్యదర్శి వి. రవి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సంఘానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ భవన నిర్మాణానికి సంబంధించి భూ కేటాయింపు అంశాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. భవన నిర్మాణానికి హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్ మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) నుంచి అనుమతులు లభించిన విషయాన్ని వివరించిన సంఘ నాయకులు, నిర్మాణ పనులను త్వరలో ప్రారంభించేందుకు అవసరమైన సహకారం అందించాలని కోరారు. అదేవిధంగా జిల్లా ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కూడా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ఆయన సానుకూలంగా స్పందించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ)కు సూచనలు చేసినట్లు నాయకులు తెలిపారు. జిల్లాలో టీఎన్జీవోస్ భవన నిర్మాణం పూర్తయితే ఉద్యోగుల సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణకు శాశ్వత వేదిక అందుబాటులోకి వస్తుందని సంఘ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కసిని శ్రీకాంత్, పి. వెంకట్ రెడ్డి, కోశాధికారి జి. శ్రీనివాస్, నాలుగో తరగతి ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు ఎండి. షరీఫ్, జిల్లా కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 22

మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ముఖ్యంగా యువత డ్రగ్స్, ఇతర వ్యసనాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును సురక్షితంగా తీర్చిదిద్దుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న నషా ముక్త్ భారత్ సప్తాహ కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రతీక్ జైన్ నషా ముక్త్ భారత్ అభియాన్ -- వికసిత్ భారత్ కి పహచాన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, మాదకద్రవ్యాల వ్యసనం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబాలు, సమాజం దేశ అభివృద్ధికి కూడా తీవ్ర ముప్పుగా మారుతుందని అన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. జూన్ 17 నుండి జూన్ 26 వరకు నిర్వహిస్తున్న నషా ముక్త్ భారత్ సప్తాహ్ -- 2026 ద్వారా మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, యువతను వ్యసనాలకు దూరంగా ఉంచడం, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. మాదకద్రవ్యాల వ్యసనానికి గురైన వారికి సకాలంలో సహాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 14446 నేషనల్ డీ-అడిక్షన్ హెల్ప్‌లైన్ సేవలను అందుబాటులో ఉంచిందని, అవసరమైన వారు ఈ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా కలెక్టర్లు సంగీత,పాండు, జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. లలితా దేవి, డీఆర్‌డీఓ జ్యోతి, జిల్లా పరిషత్ సీఈఓ జానకి రెడ్డి, రెవెన్యూ డివిజనల్ అధికారి రాజేందర్, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.




## ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలపై సమగ్ర నివేదికలు అందించాలి

### జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 22

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలో నిర్వహించిన వివిధ కార్యక్రమాలకు సంబంధించిన సమగ్ర నివేదికలను శాఖల వారీగా సిద్ధం చేసి సమర్పించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం అనంతరం అన్ని శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల అమలును పర్యవేక్షించి, సమీక్షించేందుకు ప్రభుత్వం అన్ని జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించిందన్నారు. సంగారెడ్డి జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమితులైన ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, సీనియర్ ఐఏఎస్ అధికారి డా. క్రిస్టినా జడ్ చోంగ్తు జిల్లాకు విచ్చేసి ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆయా శాఖలు తమ పరిధిలో గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలలో అలాగే వార్డులు, మున్సిపల్ పట్ట ణాల్లో నిర్వహించిన గ్రామ సభలు, ప్రత్యేక సమా వేశాలు, అవగాహన కార్యక్రమాలు తదితర కార్యక్రమాల పూర్తి వివరాలను సమగ్రంగా సిద్ధం చేసి సోమవారం సాయంత్రంలోపు సమ ర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రగతి ప్రణాళిక సభల సందర్భంగా ప్రజల నుంచి అందిన వినతులు, సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టిన చర్యలు, శాఖల వారీగా థీమ్ ఆధారంగా అమలు చేసిన కార్యక్రమాలు, వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు చేకూరిన ప్రయోజనాలు, సాధించిన లక్ష్యాలు తదితర అంశాలను నివేదికల్లో స్పష్టంగా పొందు పరచాలని సూచించారు. ప్రజా పాలన లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేయడంలో ప్రతి శాఖ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నివేదికలు ఖచ్చితమైన సమాచారంతో సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు, అన్ని శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.




## ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలి

### జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 22

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందుతున్న ప్రతి ఫిర్యాదును సత్వరంగా, పారదర్శకంగా పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా నిర్ణీత గడువులోపు చర్యలు పూర్తి చేయాలని సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు లతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల వివరాలను తెలుసుకుని సంబంధిత శాఖల జిల్లా అధికారులకు వినతులను పంపిస్తూ తగిన సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజావాణిలో మహిళా మరియు శిశు, వికలాంగులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, వ్యవసాయ శాఖ, గృహ నిర్మాణ శాఖ, పంచాయతీరాజ్ శాఖ, మున్సిపల్ శాఖ, కార్మిక శాఖ, కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ), వైద్య ఆరోగ్య శాఖ, ఇంటర్మీడియట్, వైద్య ఆరోగ్య, విద్యాశాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, బీసీ సంక్షేమ శాఖ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, రెవెన్యూ శాఖ, డీఆర్‌డీఓ తదితర శాఖలకు సంబంధించిన వినతులు అందాయి. జిల్లాలో డివిజన్ వారీగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 57 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. వాటిలో జిల్లా కలెక్టరేట్‌లో 34, సంగారెడ్డి డివిజన్‌లో 12, ఆందోల్ డివిజన్‌లో 0, నారాయణఖేడ్ డివిజన్‌లో 1, జహీరాబాద్ డివిజన్‌లో 10 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు.



## నల్సబ్‌గడ్డ ఫీడర్ పరిధిలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 22

11 కేవీ నల్సబ్‌గడ్డ ఫీడర్ పరిధిలో మరమ్మత్తు పనులు, చెట్ల కొమ్మల తొలగింపు కార్యక్రమాలు చేపట్టనున్న నేపథ్యంలో మంగళవారం (జూన్ 23) ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఈ మేరకు శివాజీనగర్, సోమేశ్వరవాడ, మొక్దూంనగర్, రిక్షా కాలనీ, శాంతినగర్ రోడ్, జలీలియా మజీద్ కాలనీ, మక్కా మజీద్ కాలనీ, క్యూబా కాలనీ, గంజి మహిద్దీన్ ప్రాంతం, కల్వకుంట గ్రామాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడనుంది. విద్యుత్ నిర్వహణ పనులను దృష్టిలో ఉంచుకుని వినియోగదారులు సహకరించాలని సంగారెడ్డి టౌన్-1 ఆపరేషన్ విభాగం ఏఈ సంతోష్ కోరారు.

## మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాల పోస్టర్ ఆవిష్కరణ





సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 22

జూన్ 26 అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్., తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా యువత, విద్యార్థులు, ప్రజలకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై విస్తృతంగా అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో యాంటీ డ్రగ్ పోస్టర్లను ఆవిష్కరించి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, సమాజాన్ని మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఆర్‌డీఎస్పీ నరేందర్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ సదా నాగరాజు, ఎస్సై కావేరి, ఎస్-ఎన్‌వైఏబీ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా వైద్య--ఆరోగ్య శాఖ నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన కలెక్టర్

సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 22

జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా వైద్య--ఆరోగ్య శాఖ (డీఎంహెచ్ఓ) కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన వైద్య, ఆరోగ్య సేవలు అందించడంలో జిల్లా వైద్య--ఆరోగ్య శాఖ కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. నూతన కార్యాలయం అందుబాటులోకి రావడం ద్వారా శాఖ కార్యకలాపాల నిర్వహణ మరింత సమర్థ వంతంగా సాగడంతో పాటు ప్రజలకు వేగవంతమైన సేవలు అందించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలకు సమర్థ0వంతంగా చేరవేసేందుకు జిల్లా ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య--ఆరోగ్య శాఖ అధికారి లలితాదేవి, శాఖ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.






# కంగ్టీ పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 22**

కంగ్టీ పోలీసు స్టేషన్‌ను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్., ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ పరిసరాల శుభ్రత, సిబ్బంది బ్యారక్, స్టేషన్ రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల స్థితిగతులను పరిశీలించారు. అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసులను సమీక్షించిన ఎస్పీ, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించి బాధితులకు అండగా నిలవాలని సూచించారు. ఫిర్యాదు నమోదు నుంచి చార్జ్‌షీట్ దాఖలు వరకు ప్రతి కేసుకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా దర్యాప్తు పూర్తి చేసి నిందితులను న్యాయస్థానం ముందు హాజరు పరచాలన్నారు. వివిధ రకాల ఆర్థిక, సైబర్ నేరాలు, పోక్సో చట్టం, మూఢనమ్మకాలపై ప్రజలలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని ఎస్‌హెచ్‌ఓకు సూచించారు. రాష్ట్ర సరిహద్దుల గుండా ఎలాంటి అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, చెక్‌పోస్టుల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, కేడీలు, అనుమానిత వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచి, పగలు-రాత్రి బీట్ విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రజలకు పారదర్శకంగా సేవలు అందేలా ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు.



పోలీసు స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను ఓపికగా విని తగిన పరిష్కారం చూపడంతో పాటు వారికి భరోసా కల్పించాలని సూచించారు. ఈ తనిఖీలో నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, కంగ్టీ సీఐ వెంకట్ రెడ్డి, ఎస్‌హెచ్‌ఓ దుర్గారెడ్డి తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నియోజకవర్గాల సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యేలు

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 22**

సంగారెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గాల్లో నెలకొన్న పలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు సోమవారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులు, రైతు సమస్యలు, తాగునీటి సౌకర్యాలు, రహదారుల అభివృద్ధి, విద్యా సంస్థల మౌలిక వసతులు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి తదితర అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సదాశివపేట మండలం బొబ్బిలిగామ ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని నీటి ట్యాంకు శిథిలావస్థకు చేరుకుందని, పాఠశాల భవన గోడలు దెబ్బతినడంతో విద్యార్థులకు కరెంట్ షాక్ ప్రమాదం పొంచి ఉందని ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టడంతో పాటు గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధి నిధుల (ఎస్‌డీఎఫ్) కింద రూ.5 కోట్ల వ్యయంతో నియోజకవర్గ పరిధిలోని రెండు పట్టణాలు, నాలుగు మండలాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల ప్రతిపాదనల పురోగతిపై కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. మల్కాపూర్ గ్రామంలో అక్రమంగా వెంచర్ ఏర్పాటు చేసి ఇంటి నంబర్లు జారీ చేసిన వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



కంది మండలం ఉత్తర్‌పల్లి గ్రామ పరిధిలో పణ్యాల నాగరాజు పొలం నుంచి చిట్యాల అఖిల్ పొలం వరకు రహదారి నిర్మాణానికి రూ.23 లక్షల అంచనా వ్యయంతో పరిపాలనా అనుమతులు మంజూరు చేసి నిధులు విడుదల చేయాలని కోరారు. సూరారం గ్రామ యూపీఎస్ పాఠశాలలో నిర్మించిన మరుగుదొడ్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులను చెల్లించాలని విజ్ఞప్తి చేయగా, జిల్లాలోని పెండింగ్ బిల్లుల వివరాలను పరిశీలించి చెల్లింపులు చేపట్టాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గిర్మాపూర్ గ్రామంలో రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) భూ బాధితులకు నష్టపరిహారం చెల్లింపులో అమలు చేస్తున్న బయోమెట్రిక్ విధానాన్ని సడలించాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కోరారు. అధిక వయస్సు కలిగిన రైతుల వేలిముద్రలు సరిగా నమోదు కాకపోవడంతో నష్టపరిహారం చెల్లింపులు ఆలస్యం అవుతున్నాయని వివరించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా బీఎల్ఓలు పట్టణ ప్రాంతాల్లో ఇంటింటి సర్వేను సమర్థవంతంగా నిర్వహించడం లేదని, బీఎల్ఏలకు సరైన సమాచారం అందడం లేదని, దీంతో నివేదికల్లో పొరపాట్లు చోటుచేసుకునే అవకాశం ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

# భువనగిరి కోట అభివృద్ధి పనులు అక్టోబర్ 2లోపు పూర్తి చేయాలి: జూపల్లి

**భువనగిరి, జూన్ 22**

భువనగిరి కోట వద్ద చేపడుతున్న పర్యాటక అభివృద్ధి పనులను అక్టోబర్ 2 నాటికి పూర్తి చేయాలని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. కోట ప్రాంతంలో జరుగుతున్న పనులను ప్రత్యక్షంగా పరిశీలించిన మంత్రి, ప్రాజెక్టుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. రోప్‌వే, హోటల్, పార్కింగ్ ప్రాంతాలు, మరుగుదొడ్లు, చిన్నారుల ఆట స్థలం, కోట పునరుద్ధరణ పనులు, ఆహార కేంద్రం, పర్యాటక సమాచార కేంద్రం తదితర అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి పరిశీలించారు. అవసరమైతే రాత్రింబవళ్లు పనులు నిర్వహించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. చారిత్రక వైభవాన్ని కాపాడుకుంటూనే భువనగిరి కోటను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. యాదాద్రి, భువనగిరి కోట, కొలనుపాక ప్రాంతాలను అనుసంధానం చేస్తూ ఆధ్యాత్మిక, వారసత్వ పర్యాటక వలయాన్ని



అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే దేశ విదేశాల నుంచి మరింత మంది పర్యాటకులు ఆకర్షితులవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం స్వదేశ్ దర్శన్ పథకం రెండో దశ కింద రూ.56.81 కోట్లతో భువనగిరి కోట అనుభూతి కేంద్రం అభివృద్ధి ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. ఇందులో రూ.17.91 కోట్లతో సుమారు 1,020 మీటర్ల పొడవు గల రోప్‌వే వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. గంటకు 250 నుంచి 300 మంది ప్రయాణికులను తరలించే సామర్థ్యంతో ఈ రోప్‌వే నిర్మాణం చేపడుతున్నారు. మిగిలిన రూ.38.90 కోట్లతో కోట వారసత్వ నిర్మాణాల పునరుద్ధరణ, రహదారులు, పార్కింగ్, విద్యుత్, తాగునీరు, సీసీ కెమెరాలు, భద్రతా వ్యవస్థలు, పర్యాటక సౌకర్యాల అభివృద్ధి పనులు చేపడుతున్నారు. కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణపై అవగాహన సదస్సు

**వరంగల్, జూన్ 22**

ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై నిర్వహించిన అవగాహన సదస్సులో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. వరంగల్‌లోని డీ కన్వెన్షన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా స్థాయి పార్టీ ప్రతినిధులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించిన అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఓటరు జాబితాలో ప్రతి అర్హుడి పేరు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని వక్తలు వివరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఖచ్చితమైన ఓటరు జాబితాలు అత్యంత కీలకమని పేర్కొన్నారు. సదస్సులో పాల్గొన్న నాయకులు క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై సూచనలు చేశారు. ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన ప్రక్రియలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించాలని




సూచించారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు చురుకుగా పాల్గొనాలని, ప్రతి గ్రామం, వార్డు స్థాయిలో ఓటరు జాబితాలను పరిశీలించాలని సూచించారు. అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మిస్ కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పేర్కొన్నారు. అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం పెంపొందించడంతో పాటు ఎన్నికల ప్రక్రియపై విశ్వాసం మరింత బలోపేతం అవుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు. సమన్వయంతో పనిచేస్తే ఓటరు జాబితాల సవరణ ప్రక్రియ మరింత సమర్థవంతంగా సాగుతుందని తెలిపారు. సదస్సులో ఓటరు జాబితాల సవరణకు సంబంధించిన పలు అంశాలపై ప్రశ్నోత్తరాలు నిర్వహించారు.ం

# ఫణిగిరి అభివృద్ధికి రూ.5 కోట్లు

**సూర్యాపేట, జూన్ 22**

తెలంగాణలోని ప్రాచీన బౌద్ధ వారసత్వ సంపద పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. సూర్యాపేట జిల్లా నాగారం మండలంలోని ఫణిగిరి, గాజులబండ బౌద్ధ క్షేత్రాల్లో పరిరక్షణ, పునరుద్ధరణ పనులకు ఎమ్మెల్యే మందుల సామేల్‌తో కలిసి సోమవారం శంకు స్థాపన చేశారు. తెలంగాణ జెన్‌కో వైటీపీఎస్ సామాజిక బాధ్యత నిధుల ద్వారా ఫణిగిరి బౌద్ధ కట్టడాల పరిరక్షణకు రూ.1.60 కోట్లు, గాజులబండ బౌద్ధ కట్టడాల సంరక్షణకు రూ.23 లక్షలు వెచ్చించనున్నట్లు మంత్రి తెలిపారు. పురాతన కట్టడాల వైభవాన్ని కాపాడుతూ వాటిని భావితరాలకు అందించడమే లక్ష్యమన్నారు. ఫణిగిరి దక్షిణ భారతదేశంలోనే అత్యంత ప్రాధాన్యమైన బౌద్ధ వారసత్వ కేంద్రాల్లో ఒకటిగా గుర్తింపు పొందిందని మంత్రి



పేర్కొన్నారు. బౌద్ధ ధర్మం శాంతి, అహింస, మానవతా విలువలకు ప్రతీకగా నిలిచిందని, అలాంటి చారిత్రక సంపదను సంరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ఫణిగిరి, గాజుల బండ వంటి బౌద్ధ క్షేత్రాల అభివృద్ధి ద్వారా తెలంగాణను జాతీయ, అంతర్జాతీయ బౌద్ధ పర్యాటక పటంలో మరింత ప్రముఖంగా నిలబెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. తవ్వకాలలో వెలుగులోకి వచ్చిన శిల్పాలు, శాసనాలు, నాణేలు తెలంగాణ చరిత్ర గొప్పతనాన్ని ప్రపంచానికి చాటుతున్నాయని చెప్పారు. ఎమ్మెల్యే మందుల సామేల్ విజ్ఞప్తికి స్పందించిన మంత్రి జూపల్లి కృష్ణారావు ఫణిగిరి బౌద్ధ క్షేత్ర సమగ్ర అభివృద్ధికి రూ.5 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిధులతో ప్రధాన రహదారి నుంచి క్షేత్రానికి చేరుకునే అనుసంధాన రహదారి, కొండపైకి వెళ్లే మెట్ల మార్గం, పర్యాటక మౌలిక సదుపాయాలు, సందర్శకుల వసతి సౌకర్యాల అభివృద్ధి చేపట్టనున్నట్లు తెలిపారు.



# మంజీరా సంప్ హౌస్‌లో శుద్ధి ట్యాంకుల పనుల పరిశీలన

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 22**

సంగారెడ్డి పట్టణంలోని మంజీరా సంప్ హౌస్‌లో నీటి శుద్ధి ట్యాంకుల శుభ్రపరిచే పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. పట్టణంలోని పాత బస్టాండ్, కొత్త బస్టాండ్ చౌరస్తా ప్రాంతాలను అనుసంధానం చేసే ఇంటర్ కనెక్షన్ పైప్‌లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ పనులు పూర్తయితే తాగునీటి సరఫరా వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా తాత్కాలికంగా నిలిచిపోయిన పరిస్థితుల్లో కూడా పట్టణ ప్రజలకు తాగునీటి కొరత తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి నిర్మించిన పాత సంప్ ద్వారా ప్రత్యామ్నాయంగా నీటి సరఫరా అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. పట్టణ ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర తాగునీటి సరఫరా అందించేందుకు మున్సిపల్ యంత్రాంగం అన్ని విధాలా కృషి చేస్తోందని చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్, కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.



# చిరంజీవిని కలిసిన రాంచందర్ రావు

**హైదరాబాద్, జూన్ 22**

టాలీవుడ్ అగ్ర నటుడు చిరంజీవిని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు మర్యాదపూర్వకంగా కలిశారు. చిరంజీవి నివాసానికి వెళ్లిన రాంచందర్ రావు ఆయనతో భేటీ అయ్యి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించినట్లు సమాచారం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా బీజేపీ నిర్వహిస్తున్న మహా జనసంపర్క్ అభియాన్‌లో భాగంగా ఈ సమావేశం జరిగింది. సమాజంలోని వివిధ రంగాల ప్రముఖులను కలిసి కేంద్ర ప్రభుత్వ విజయాలను వివరించే కార్యక్రమంలో భాగంగా చిరంజీవిని కలిసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, దేశ ప్రగతికి సంబంధించిన ప్రత్యేక పుస్తకం, సమాచార కరపత్రాలను రాంచందర్ రావు చిరంజీవికి అందజేశారు. దాదాపు అరగంటకు పైగా సాగిన ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చ జరిగినట్లు తెలిసింది. దేశ ఆర్థిక పురోగతి, సాంస్కృతిక అభివృద్ధి, వినోద రంగంలో జరుగుతున్న మార్పులు, పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లపై ఇరువురి మధ్య అభిప్రాయాల మార్పిడి జరిగినట్లు సమాచారం. అయితే ఈ భేటీ పూర్తిగా మర్యాదపూర్వకంగానే జరిగిందని బీజేపీ నేతలు స్పష్టం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ సమావేశం అనంతరం సామాజిక మాధ్యమాల్లో పలు రాజకీయ ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. గతంలో కేంద్ర మంత్రిగా పనిచేసిన చిరంజీవి మళ్లీ క్రియాశీల రాజకీయాల్లోకి వస్తారా అనే చర్చ ప్రారంభమైంది. అయితే దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రస్తుతం చిరంజీవి పూర్తిస్థాయిలో సినీ రంగంపైనే దృష్టి సారిస్తున్న నేపథ్యంలో ఈ భేటీని రాజకీయ కోణంలో కాకుండా మర్యాదపూర్వక సమావేశంగానే చూడాలని బీజేపీ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే రాజకీయ వర్గాల్లో మాత్రం ఈ భేటీపై ఆసక్తికర చర్చ కొనసాగుతోంది.



# రాజ్యాధికార సమరభేరికి సన్నాహాలు

**హైదరాబాద్, జూన్ 22**

తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న యాదాద్రి భువనగిరి జిల్లా పార్టీ నాయకులతో హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశమయ్యారు. జిల్లా అధ్యక్షుడు కొమ్మరిశెట్టి నరసింహులు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి జిల్లాలోని 16 మండలాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జూలై 5న భువనగిరి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న “రాజ్యాధికార సమరభేరి” సభ ఏర్పాట్లపై విస్తృతంగా చర్చించారు. సభను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణ, జనసమీకరణ, ప్రచార కార్యక్రమాలు, నిర్వహణ ఏర్పాట్లపై నాయకులకు తీన్మార్ మల్లన్న దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో పార్టీ విస్తరణకు ఇలాంటి సభలు కీలకమని పేర్కొన్న ఆయన, ప్రతి నాయకుడు బాధ్యతగా పనిచేసి సభ విజయవంతానికి కృషి చేయాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణంపై కూడా సమావేశంలో సమీక్ష నిర్వహించారు.




# మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

**ఆదిలాబాద్, జూన్ 22**

మత్తుపదార్థాల వినియోగాన్ని నిర్మూలించాలనే లక్ష్యంతో చేపట్టిన నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆదిలాబాద్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధికారులు, యువత, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్ ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. అనంతరం మత్తుపదార్థాలకు దూరంగా ఉంటామని, సమాజంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు కృషి చేస్తామని పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మత్తుపదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని అన్నారు. కుటుంబాలు, విద్యాసంస్థలు, సమాజం కలిసి పనిచేస్తేనే మాదకద్రవ్యాల వ్యసనాన్ని సమర్థవంతంగా అరికట్టగలమని పేర్కొన్నారు. యువత ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు.



# రైతులకు ఎరువుల కొరత రాకూడదు

**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 22**

రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. బూర్గంపాడు మండలం మొరంపల్లి బంజర గ్రామంలోని శ్రీ లక్ష్మీ గణపతి ఫెర్టిలైజర్స్ దుకాణాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేసి పరిస్థితిని సమీక్షించారు. వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి దుకాణంలోని పత్తి విత్తనాలు, రసాయనిక ఎరువులు, పురుగుల మందుల నిల్వలను కలెక్టర్ పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్లు, విక్రయాల వివరాలను తనిఖీ చేసి రైతులకు అవసరమైన వ్యవసాయ ఇన్‌పుట్లు అందుబాటులో ఉన్నాయా లేదా అని ఆరా తీశారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో సమన్వయమే కీలకం

**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 22**



జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు సత్వర సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి వినతిని బాధ్యతాయుతంగా పరిగణించి నిర్ణీత గడువులో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వినతులు, ఫిర్యాదులను కలెక్టర్ స్వీకరించారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై వాటి పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. ప్రజలు వ్యక్తిగత, సామూహిక సమస్యలను వివరించగా ప్రతి వినతిపత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా ప్రజలు ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతో తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తున్నారని అన్నారు. అందువల్ల ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యంతో పరిగణించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయం పెంపొందించడం ద్వారా సమస్యల పరిష్కార ప్రక్రియ మరింత వేగవంతమవుతుందని తెలిపారు. వెంటనే పరిష్కరించగల అంశాలను ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని, మిగిలిన వాటిని నిర్దేశిత గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి తావు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు.

# రైతు భరోసా సభకు భారీ ఏర్పాట్లు

**ఖమ్మం, జూన్ 22**



రాష్ట్రంలోని రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా నిధులను విడుదల చేసే కార్యక్రమానికి మధిర నియోజకవర్గం వేదిక కానుంది. ఈ నెల 30న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రాష్ట్రవ్యాప్తంగా రైతుల ఖాతాల్లోకి ఒకే క్లిక్ ద్వారా రైతు భరోసా నిధులు జమ చేయనున్న నేపథ్యంలో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. సభ నిర్వహణ కోసం చింతకాని మండలంలో అనువైన స్థలాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్‌తో కలిసి ఆదివారం పరిశీలించారు. సభా ప్రాంగణ ఏర్పాట్లు, ప్రజల రాకపోకలు, పార్కింగ్, భద్రత, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలపై అధికారులతో క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించారు. రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రైతులకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల్లో రైతు భరోసా కీలకమని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా లక్షలాది మంది రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. మధిర చరిత్రలోనే ఎన్నడూ లేని స్థాయిలో ఈ సభను నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. సుమారు రెండు లక్షల మంది రైతులు, ప్రజలు హాజరయ్యేలా కాంగ్రెస్ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని పార్టీ నాయకులకు సూచించారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమిష్టిగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు.




# సింగరేణి ఉద్యోగులకు బీమా భరోసా

**కొత్తగూడెం, జూన్ 22**

సింగరేణి కార్మికుల సంక్షేమానికి మరో కీలక నిర్ణయం తీసుకుంటూ సింగరేణి సంస్థ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో ప్రత్యేక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా సెంట్రల్ బ్యాంక్‌లో వేతన ఖాతాలు కలిగిన సింగరేణి ఉద్యోగులకు భారీ బీమా రక్షణతో పాటు పలు ప్రత్యేక బ్యాంకింగ్ సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. ఒప్పందం ప్రకారం ప్రమాదవశాత్తు మరణం లేదా శాశ్వత వైకల్యం సంభవించిన సందర్భంలో ఉద్యోగులకు రూ.1 కోటి నుంచి రూ.1.50 కోట్ల వరకు బీమా రక్షణ లభించనుంది. సహజ మరణం సంభవించిన సందర్భంలో రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు బీమా ప్రయోజనం అందించనున్నారు. దీంతో ఉద్యోగులు, వారి కుటుంబాలకు ఆర్థిక భద్రత మరింత బలపడనుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మార్గదర్శకత్వంలో ఈ ఒప్పందం అమలులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు. సింగరేణి ఛైర్మన్, ఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి, డైరెక్టర్ (పర్సనల్ అండ్ ఫైనాన్స్) గౌతమ్ పోట్రు ప్రత్యేక చొరవతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. సోమవారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జనరల్ మేనేజర్ (పర్సనల్) వెల్ఫేర్ అండ్ సీఎస్ఆర్ జి.వి. కిరణ్ కుమార్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ జోన్ డిప్యూటీ జోనల్ హెడ్ ఎ.వి. రమణమూర్తి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

# యూట్యూబర్ వీసా కేసులో పురోగతి


**రంగారెడ్డి, జూన్ 22**

యూట్యూబర్ నందూస్ వరల్డ్‌కు సంబంధించిన వీసా అక్రమాల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఇప్పటికే నమోదైన ఆరోపణల నేపథ్యంలో మధుకర్ తండ్రి మోహనరావు ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. వీసా మోసానికి సంబంధించి గతంలో క్రాంతి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో మధుకర్, నందు, మధుకర్ తండ్రి మోహనరావులను నిందితులుగా చేర్చినట్లు సమాచారం. కేసుకు సంబంధించిన అంశాలపై పూర్తి వివరాలు సేకరించేందుకు పోలీసులు విచారణను వేగవంతం చేశారు. ఈ క్రమంలో మోహనరావును స్టేషన్‌కు పిలిపించి పలు అంశాలపై ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. వీసాల పేరుతో మోసం జరిగిందనే ఆరోపణలపై ఇప్పటికే పలు ఆధారాలను పోలీసులు సేకరిస్తున్నారు. బాధితుల వాంగ్మూలాలు, ఆర్థిక లావాదేవీల వివరాలు, సంబంధిత పత్రాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ కేసు సోషల్ మీడియాలో విస్తృత చర్చకు దారితీసిన నేపథ్యంలో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. విచారణలో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో మోహనరావు విచారణ కొనసాగుతోంది. కేసు దర్యాప్తు పూర్తయ్యే వరకు మరిన్ని వివరాలు వెల్లడించే అవకాశం లేదని పోలీసు వర్గాలు పేర్కొన్నాయి.



# మత్తు వదలండి.. మైదానాలు చేరండి

**మహబూబ్‌నగర్, జూన్ 22**





యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండి క్రీడల వైపు అడుగులు వేయాలని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం మైదానంలో రూ.12.53 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఆధునిక క్రీడా మౌలిక సదుపాయాల పనులకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డితో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రూ.10.70 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాల 400 మీటర్ల ఎనిమిది లైన్ల సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్, రూ.1 కోట్లతో నాలుగు బహిరంగ వ్యాయామ కేంద్రాలు, రూ.51 లక్షలతో ఇండోర్ జిమ్, మహిళల అథ్లెటిక్స్ వసతి గృహం మిగిలిన పనులకు నిధులు వెచ్చించనున్నారు. ఈ సదుపాయాలు జిల్లాలోని యువ క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అవకాశాలను కల్పిస్తాయని మంత్రి తెలిపారు. క్రీడలు కేవలం వినోదం మాత్రమే కాకుండా వ్యక్తిత్వ వికాసానికి, క్రమశిక్షణకు దోహదపడే సాధనమని మంత్రి పేర్కొన్నారు. ప్రతి యువకుడు క్రీడలపై ఆసక్తి పెంచుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు.



# వర్షాకాలానికి ఆర్అండ్‌బీ అప్రమత్తం

**హైదరాబాద్, జూన్ 22**

వర్షాకాలంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ రహదారులు, వంతెనలు, ఇతర మౌలిక సదుపాయాల రక్షణకు ఆర్అండ్‌బీ శాఖ ప్రత్యేక కార్యాచరణ విధానాన్ని అమలు చేస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు వరదల సమయంలో తక్షణ స్పందన కోసం ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసినట్లు వెల్లడించారు. జూన్ నుంచి అక్టోబర్ వరకు వర్షాకాలం ముగిసేంత వరకు శాఖ అధికారులు పూర్తి అప్రమత్తతతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. సూపరింటెండింగ్ ఇంజినీర్ నుంచి అసిస్టెంట్ ఇంజినీర్ వరకు అన్ని స్థాయిల అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రహదారి రవాణా వ్యవస్థను నిరంతరం కొనసాగించడమే లక్ష్యమన్నారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జేసీబీలు, ఎక్స్కవేటర్లు, టిప్పర్లు, నీటిని తొలగించే యంత్రాలు, ఇసుక సంచులు, తారు, కంకర, పైపులు తదితర సామగ్రిని ముందుగానే సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాలు, ముంపు ప్రమాదం ఉన్న రహదారులు, వంతెనలు, కల్వర్టులను ముందుగానే గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. వాతావరణ శాఖ, రాష్ట్ర విపత్తు నిర్వ హణ సంస్థల హెచ్చరికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అప్రమత్తంగా ఉండాలని మంత్రి పేర్కొన్నారు. పోలీసు, రెవెన్యూ, సాగునీరు, విద్యుత్ శాఖలతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ముందుగానే గుర్తించాలని ఆదేశించారు. భారీ వర్షాలు, వరదల కారణంగా రహదారులు దెబ్బతిన్న వెంటనే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి తాత్కా లిక పునరుద్ధరణ పనులు ప్రారంభించా లని మంత్రి స్పష్టం చేశారు. నష్టం జరిగిన 24 గంటల్లోపు ఫోటోలు, స్థాన వివరాలతో కూడిన పూర్తి నివేదికలను సమర్పించాలని ఆదేశించారు.



# పల్స్ పోలియోపై కలెక్టర్ సమీక్ష

**మహబూబాబాద్, జూన్ 22**

జిల్లాలో పల్స్ పోలియో, జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయా లని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సంబంధిత అధికారులతో కార్యక్రమాల ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ జిల్లాలో అర్హత కలిగిన ప్రతి చిన్నారికి పల్స్ పోలియో చుక్కలు అందేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. మారు మూల ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతా ల్లోనూ ఎవరూ మిగిలిపోకుండా చర్యలు తీసుకో వాలని సూచించారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని కూడా సమర్థ వంతంగా నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నా రు. పాఠశా లలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లక్ష్యిత పిల్లలకు మందులు అందేలా ముందస్తు ఏర్పా ట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆరోగ్య, విద్య, మహిళా శిశు సంక్షేమ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. ప్రజల్లో అవగా హన పెంచేందుకు ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. కార్య క్రమాల అమలులో ఎలాంటి లోపాలు తలెత్త కుండా అవసరమైన మందు లు, సిబ్బం ది, రవాణాసౌకర్యాలు అందు బాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.

# అన్విత ఖమ్మం ఏసెస్‌కు ఘన ఆరంభం

**ఖమ్మం, జూన్ 22**

ప్రతిష్టాత్మక టీజీ20 టోర్నమెంట్ తొలి మ్యాచ్‌లో అన్విత ఖమ్మం ఏసెస్ జట్టు అద్భుత ప్రదర్శనతో విజయాన్ని అందుకుంది. పాలమూరు స్ట్రైకర్స్‌పై 20 పరుగుల తేడాతో గెలిచి టోర్నీలో శుభారంభం చేసింది. మొదట బ్యాటింగ్ చేసిన ఖమ్మం జట్టు భారీ స్కోరును నమోదు చేసింది. వాఫి కచ్చి (60), సాయికృష్ణ (52) అర్ధ సెంచరీలతో చెలరేగగా, హిమతేజ (59 నాటౌట్) చివరి వరకు నిలబడి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ఈ ముగ్గురు బ్యాటర్ల ధాటికి జట్టు నిర్ణీత ఓవర్లలో 5 వికెట్లకు 237 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో పాలమూరు స్ట్రైకర్స్ గట్టి పోరాటం చేసినప్పటికీ విజయాన్ని అందుకోలేకపోయింది. ఓపెనర్ విఘ్నేశ్ (86) అద్భుత ఇన్నింగ్స్ ఆడినా, ఇతర బ్యాటర్ల నుంచి సహకారం లేకపోవడం జట్టుకు పెద్ద లోటుగా మారింది. ఖమ్మం బౌలర్లు కీలక సమయంలో కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి వికెట్లు తీయడంతో మ్యాచ్ మలుపు తిరిగింది. చివరికి పాలమూరు జట్టు 6 వికెట్లకు 217 పరుగులు మాత్రమే చేయగలిగింది.




# 2027 వరల్డ్‌కప్‌పై బీసీసీఐ రోడ్‌మ్యాప్

**న్యూఢిల్లీ, జూన్ 22:**

2023 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్‌లో ఎదురైన పరాజయం తర్వాత 2027 మెగా టోర్నీని లక్ష్యంగా పెట్టుకుని భారత క్రికెట్ నియంత్రణ మండలి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. బోర్డు ఇప్పటికే కొత్త రోడ్‌మ్యాప్‌ను రూపొందిస్తూ, సెలెక్టర్లు, కోచింగ్ స్టాఫ్ మధ్య పూర్తి సమన్వయంతో జట్టు నిర్మాణంపై దృష్టి పెట్టినట్లు వెల్లడించింది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆటగాళ్ల ఎంపిక, కాంబినేషన్లు, వ్యూహాలు రూపుదిద్దుకుంటున్నాయి. ఇంగ్లాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌ను ఈ ప్రణాళికలో కీలక పరీక్షగా భావిస్తున్నారు. ఈ సిరీస్ ద్వారా కొత్త ఆటగాళ్ల ప్రదర్శనను అంచనా వేసి, 2027 వరల్డ్‌కప్‌కు బలమైన జట్టును తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. భారత జట్టు ఎంపిక కమిటీ ఛైర్మన్ అజిత్ అగార్కర్, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ కలిసి జట్టు కూర్పుపై సన్నిహితంగా పనిచేస్తున్నారని సమాచారం. కొత్త వన్డే కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ బాధ్యతలు చేపట్టడంతో, అతని నాయకత్వంలో జట్టు కొత్త దశలోకి అడుగుపెట్టింది. ఇప్పటికే ఆఫ్ఘనిస్థాన్‌పై క్లీన్‌స్వీప్ సాధించిన భారత్, ఇంగ్లాండ్ సిరీస్‌తో తన బలాన్ని మరింత పరీక్షించుకోనుంది. బీసీసీఐ లక్ష్యం కేవలం తాత్కాలిక విజయాలు కాకుండా, 2027 వరల్డ్‌కప్‌ను గెలిచే స్థాయి బలమైన జట్టును నిర్మించడం అని స్పష్టం చేసింది.



# పావెల్ సిక్సర్ల సునామీతో నైట్ రైడర్స్ ఘన విజయం

**లాస్ ఏంజెలెస్, 22**

అమెరికాలో జరుగుతున్న మేజర్ లీగ్ క్రికెట్ (ఎంఎల్‌సీ) టోర్నమెంట్‌లో లాస్ ఏంజెలెస్ నైట్ రైడర్స్ జట్టు భారీ విజయాన్ని నమోదు చేసింది. సియాటిల్ ఓర్కాస్‌పై 81 పరుగుల తేడాతో గెలిచి అభిమానులను ఉర్రూత లూగిం చింది. ఈ మ్యాచ్‌లో వెస్టిండీస్ పవర్ హిట్టర్ రోవ్‌మన్ పావెల్ విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగి పోయాడు. కేవలం 11 బంతుల్లోనే 37 పరు గులు చేసి జట్టు స్కోరును ఆకాశానికెత్తాడు. మ్యాచ్‌లో కీలక ఘట్టంగా 17వ ఓవర్ నిలిచింది. శ్రీలంక ఆల్‌రౌండర్ దసున్ శనక వేసిన ఆ ఓవర్‌లో పావెల్ వరుసగా ఐదు సిక్సర్లు బాదాడు. ఆ ఒక్క ఓవర్‌లోనే 30 పరుగులు వచ్చా యి. పావెల్ దూకు డుతో లాస్ ఏంజె ంలెస్ నైట్ రైడర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 196 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన సియాటిల్ ఓర్కాస్ జట్టు 115 పరుగులకే కుప్పకూలింది. బౌలర్ల కట్టుదిట్టమైన ప్రదర్శనతో నైట్ రైడర్స్ సులభంగా విజయం సాధించి టోర్నీలో తమ స్థితిని బలోపేతం చేసు కుంది.




# ముంబై ఇండియన్స్‌లో భారీ మార్పుల చర్చ

**జూన్ 22**

ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన ఫ్రాంచైజీలలో ఒకటైన ముంబై ఇండియన్స్ జట్టులో భారీ మార్పులు జరగనున్నాయనే ఊహాగానాలు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. జట్టు కెప్టెన్‌గా ఉన్న స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా జట్టును వీడే అవకాశం ఉందని వార్తలు వినిపిస్తున్నాయి. అతని నాయకత్వంలో జట్టు ఆశించిన స్థాయిలో రాణించలేకపోవడం, డ్రెస్సింగ్ రూమ్‌లో అసంతృప్తి పెరగడం వంటి కారణాలు ఈ నిర్ణయానికి దారి తీసినట్లు చెబుతున్నారు. అతని స్థానంలో రాజస్థాన్ రాయల్స్ యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ను ట్రేడ్ ద్వారా తీసుకురావాలని ముంబై యాజమాన్యం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. రాజస్థాన్ జట్టులో ఇటీవల అతని పాత్రపై అనిశ్చితి ఉండటంతో ఈ మార్పు చర్చకు వచ్చింది. అదే సమయంలో స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ కూడా ముంబై ఇండియన్స్‌ను వీడే ఆలోచనలో ఉన్నాడని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కొత్త జట్ల నుంచి అతనికి కెప్టెన్సీ ఆఫర్లు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల మధ్య ముంబై ఇండియన్స్ జట్టు భవిష్యత్ ప్రణాళికలు ఆసక్తికరంగా మారాయి. సీనియర్ ఆటగాళ్ల స్థానంలో కొత్త తరం స్టార్ ప్లేయర్లతో



# ఈజిప్ట్‌కు చరిత్రాత్మక విజయం

**న్యూయార్క్, జూన్ 22**

ఫిఫా వరల్డ్ కప్‌లో ఈజిప్ట్ జాతీయ ఫుట్‌బాల్ జట్టు చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 3-1 గోల్స్ తేడాతో గెలిచి అభిమానులను ఆనందంలో ముంచెత్తింది. మ్యాచ్ ప్రారంభంలో ఆధిక్యం న్యూజిలాండ్‌కే దక్కింది. 15వ నిమిషంలో ఫిన్ సుర్మన్ గోల్ చేసి జట్టుకు లీడ్ అందించాడు. కానీ రెండో అర్ధభాగంలో ఈజిప్ట్ ఆటగాళ్లు అద్భుతంగా పుంజుకున్నారు. కేవలం 24 నిమిషాల వ్యవధిలో మూడు గోల్స్ చేసి మ్యాచ్‌ను పూర్తిగా తమ వైపు తిప్పుకున్నారు. ఈ విజయంతో ఈజిప్ట్ గ్రూప్ జీ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. ఈజిప్ట్ స్టార్ ప్లేయర్ మొహమ్మద్ సలాహ్ ఈ మ్యాచ్‌లో కీలక పాత్ర పోషించాడు. ఒక గోల్ చేయడంతో పాటు మరో గోల్‌కు అసిస్ట్ అందించి జట్టు విజయానికి ప్రధాన కారణమయ్యాడు. ఈజిప్ట్ నాలుగోసారి వరల్డ్ కప్‌లో పాల్గొంటుండగా, 1934 తర్వాత తొలిసారి ఈ స్థాయిలో విజయం నమోదు చేయడం విశేషంగా మారింది. తదుపరి మ్యాచ్‌లో ఇరాన్‌తో గెలిస్తే నాకౌట్ దశకు చేరే అవకాశం ఉంది.






## విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్‌పై స్పష్టత

**న్యూఢిల్లీ, జూన్ 22**

భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్‌పై వస్తున్న రీఎంట్రీ ఊహాగానాలకు పూర్తి తెరదించాడు. టెస్ట్ ఫార్మాట్‌లో తిరిగి ఆడే అవకాశం లేదని ఆయన స్పష్టం చేశాడు. న్యూఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న కోహ్లీని టెస్ట్ క్రికెట్‌కు మళ్లీ వచ్చే ఆలోచన ఉందా అని ప్రశ్నించగా, తాను ఆ ఫార్మాట్‌కు పూర్తిగా వీడ్కోలు పలికానని, ఇక తిరిగి రానని తేల్చి చెప్పాడు. ఇది గతమేనని ఆయన వ్యాఖ్యానించారు. ఐపీఎల్ సందర్భంగా గాయపడిన కోహ్లీ ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ గాయం కారణంగా ఇటీవల ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన వన్డే సిరీస్‌కు కూడా ఆయన దూరమయ్యాడు. త్వరలో బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఫిట్‌నెస్ టెస్ట్‌కు హాజరుకానున్నట్లు సమాచారం. టెస్ట్ కెరీర్ విశేషాలు కోహ్లీ తన 14 ఏళ్ల టెస్ట్ కెరీర్‌లో 123 మ్యాచ్‌లు ఆడి 9,230 పరుగులు సాధించాడు. ఇందులో 30 సెంచరీలు, 31 అర్ధ సెంచరీలు ఉన్నాయి. అతని అత్యధిక స్కోర్ 254 నాటౌట్. భారత టెస్ట్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో ఆయన నాలుగో స్థానంలో నిలిచాడు. టెస్ట్ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన తర్వాత కూడా కోహ్లీ వన్డేలు, టీ20ల్లో కొనసాగుతున్నాడు.



## ఘలేనోయి ప్రశంసలు.. ఈజిప్ట్ మ్యాచ్‌పై దృష్టి


**సోఫీ స్టేడియం, జూన్ 22**

ఫిఫా ప్రపంచ కప్ 2026 గ్రూప్ జీ మ్యాచ్‌లో బెల్జియంతో గోల్ రహిత డ్రా సాధించిన తర్వాత ఇరాన్ జాతీయ ఫుట్‌బాల్ జట్టు హెడ్ కోచ్ అమీర్ ఘలేనోయి తన జట్టు ప్రదర్శనను ప్రశంసించారు. బెల్జియం వంటి శక్తివంతమైన జట్టుపై విలువైన పాయింట్ సాధించడం సంతృప్తికరమని ఆయన తెలిపారు. అదే సమయంలో ఈజిప్ట్‌తో జరిగే చివరి గ్రూప్ మ్యాచ్ ముందు ఆటగాళ్ల శారీరకంగా కోలుకోవడం పెద్ద సవాలుగా మారిందని చెప్పారు. ఈ మ్యాచ్‌లో గోల్ కీపర్ అలీరెజా బీరన్‌వంద్ అద్భుత ప్రదర్శనతో బెల్జియం దాడులను అడ్డుకున్నాడు. అనేక కీలక సేవ్‌లతో అతను మ్యాచ్‌లో కీలక పాత్ర పోషించాడు. ఇరాన్ తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో 2-2 డ్రా చేసుకుని, ఇప్పుడు రెండు మ్యాచ్‌ల నుంచి రెండు విలువైన పాయింట్లు సాధించింది. ఈ ఫలితాలతో గ్రూప్ జీ పట్టికలో రెండో స్థానంలో కొనసాగుతూ నాకౌట్ దశకు చేరే అవకాశాలను బలపరుచుకుంది. మ్యాచ్ అనంతరం ఘలేనోయి మాట్లాడుతూ, గత ఆరు నెలలుగా తమ జట్టు ఎదుర్కొన్న క్లిష్ట పరిస్థితులను ప్రస్తావించారు. ప్రయాణ సమస్యలు, సన్నాహక లోపాలు ఉన్నప్పటికీ ఆటగాళ్లు చూపిన పట్టుదల గొప్పదని ఆయన అన్నారు. ఇప్పుడు అందరి దృష్టి శనివారం జరిగే ఈజిప్ట్‌తో కీలక పోరుపై నిలిచింది. ఆ మ్యాచ్ ఫలితమే ఇరాన్ భవితవ్యాన్ని నిర్ణయించనుంది.

## వెంకటేష్-కళ్యాణ్‌రామ్
# చిత్రం సందడి

**హైదరాబాద్, జూన్ 22**


విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్‌రామ్ కథానాయకులుగా దర్శకుడు అనిల్ రావిపూడి రూపొందిస్తున్న మల్టీ స్టారర్ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొ న్నాయి. ఇటీవల పూజా కార్యక్రమాలతో అధికారికంగా ప్రారంభమైన ఈ సినిమాకు సంబంధించిన తాజా ప్రచార వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. హాస్యం, సరదా సంభాషణలు, కథ నేపథ్యానికి సంబంధించిన ఆసక్తికర సంకేతాలతో రూపొందించిన ఈ వీడియో సినిమాపై మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఆదివారం విడుదలైన ఈ ప్రత్యేక వీడియోలో వెంకటేష్, కళ్యాణ్‌రామ్, సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ మధ్య జరిగిన సరదా సంభాషణలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. “పాపం అనిల్‌ను ఇసుకలో పాతేశారట” అంటూ వెంకటేష్ సరదాగా వ్యాఖ్యానించగా, “పటాస్ సమయంలో బాగానే ఉన్నాడు.. కానీ ‘నేను పాడతా’ అని మీరే ఇలా చేశారంటూ” కళ్యాణ్‌రామ్ చమత్కరించడం నవ్వులు పూయించింది. అంతలోనే కథానాయికలు కీర్తి సురేష్, కృతి శెట్టి భయపడుతూ అక్కడికి పరుగెత్తుకుంటూ రావడం, వారి వెనుక చేతిలో కత్తితో దర్శకుడు అనిల్ రావిపూడి ఎంట్రీ ఇవ్వడం వీడియోలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. “కత్తిలాంటి ఆలోచనలతో ప్రచారం చేస్తున్నానని అభిమానులే నా చేతిలో కత్తి పెట్టారు” అంటూ అనిల్ చేసిన వ్యాఖ్యలు వినోదాన్ని మరింత పెంచాయి. అంతేకాక, ఎప్పుడూ తానే కొత్త ఆలోచనలు చెప్పాలా, ఈసారి మీరు ఏదైనా కొత్త ఐడియా చెప్పాలని అనిల్ హీరోలను అడగగా.. వెంకటేష్ “కత్తిలాంటి ఆలోచన” అంటూ అనిల్ వేలు కోసినట్లు నటిస్తూ రక్తంతో విజయ తిలకం దిద్దడం సరదాగా చూపించారు. ఆ తర్వాత కళ్యాణ్‌రామ్, కథానాయికలు కూడా అదే తరహాలో పాల్గొనడం వీడియోకు హాస్యరసాన్ని తెచ్చిపెట్టింది. వీడియో చివర్లో సినిమాకు సంబంధించిన కీలక విషయాన్ని అనిల్ రావిపూడి వెల్లడించారు. “రాయలసీమ నేపథ్యం అంటే కేవలం రక్తపాతమే అనుకోవద్దు. ఇది పూర్తి స్థాయి కుటుంబ హాస్యభరిత వినోదాత్మక చిత్రం” అని స్పష్టం చేశారు. దీంతో ఈ చిత్రం రాయలసీమ నేపథ్యంలో సాగే కుటుంబ కథా చిత్రమని, అనిల్ రావిపూడి శైలిలో వినోదంతో పాటు భావోద్వేగాలు కూడా ఉండనున్నాయని అర్థమవుతోంది. ప్రస్తుతం తాత్కాలికంగా ‘వెంకీ-అనిల్ 5’, ‘ఎన్‌కేఆర్-ఏఆర్ 2’ పేర్లతో తెరకెక్కుతున్న ఈ సినిమా చిత్రీకరణ జూన్ 22 నుంచి ప్రారంభం కానుంది. 2027 సంక్రాంతి కానుకగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం




## రామ్-భాగ్యశ్రీపై
# మళ్లీ రూమర్లు

**హైదరాబాద్, జూన్ 22**

సినీ పరిశ్రమలో హీరో, హీరోయిన్ల మధ్య స్నేహం, ప్రేమ, పెళ్లి వార్తలు ఎప్పుడూ ఆసక్తికర చర్చలకు దారి తీస్తుంటాయి. కొన్ని సందర్భాల్లో అవి కేవలం పుకార్లుగానే మిగిలిపోతే, మరికొన్ని సందర్భాల్లో నిజమై వివాహ బంధంగా మారిన ఉదాహరణలు కూడా ఉన్నాయి. ఇప్పుడు టాలీవుడ్‌లో అలాంటి మరో వార్త సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని, యువ కథానాయిక భాగ్యశ్రీ బోర్సే ప్రేమలో ఉన్నారనే ప్రచారం మళ్లీ ఊపందుకుంది. ‘మిస్టర్ బచ్చన్’ చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన భాగ్యశ్రీ బోర్సే తన అందం, గ్లామర్‌తో యువతలో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత ఆమె రామ్ పోతినేని సరసన ‘ఆంధ్రా కింగ్’ చిత్రంలో నటించే అవకాశం దక్కించుకుంది. ఈ సినిమా ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోకపోయినా, చిత్రీకరణ సమయంలోనే రామ్, భాగ్యశ్రీ మధ్య మంచి స్నేహం ఏర్పడిందనే ప్రచారం సినీ వర్గాల్లో వినిపించింది. ఆ స్నేహమే క్రమంగా ప్రేమగా మారిందనే వార్తలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో మళ్లీ చక్కర్లు కొడుతున్నాయి. ఇటీవల తన తాజా చిత్రం ‘లెనిన్’ ప్రచార కార్యక్రమాల్లో భాగంగా పాల్గొన్న ఒక టాక్ షోలో భాగ్యశ్రీ చేసిన వ్యాఖ్యలు ఈ రూమర్లకు మరింత బలం చేకూర్చాయి.







# అల్లు అర్జున్ కేసు వచ్చే నెలకి వాయిదా

**హైదరాబాద్, జూన్ 22**

టాలీవుడ్ స్టార్ హీరో అల్లు అర్జున్‌కు సంబంధించి సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ‘పుష్ప-2: ది రూల్’ స్పెషల్ ప్రీమియర్ సందర్భంగా జరిగిన విషాద ఘటనకు సంబంధించిన కేసును విచారిస్తున్న హైదరాబాద్ నాంపల్లి క్రిమినల్ కోర్టు అల్లు అర్జున్‌కు సమన్లు జారీ చేసింది. జూన్ 22న వ్యక్తిగతంగా కోర్టు ఎదుట హాజరుకావాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ, ఆయన వృత్తిపరమైన పనులతో బిజీగా ఉండటంతో హాజరుకాలేదని సమాచారం. ఈ నేపథ్యంలో వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆయన తరఫు న్యాయవాదులు కోర్టును అభ్యర్థించినట్లు తెలుస్తోంది. అదే సమయంలో కేసులో ఇతర నిందితులు కోర్టుకు హాజరై బాండ్లపై సంతకాలు చేశారు. తదుపరి విచారణను న్యాయస్థానం జూలై 6కి వాయిదా వేసింది. ఈ ఘటన 2024 డిసెంబర్ 4న ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్‌లో చోటుచేసుకుంది. ‘పుష్ప-2’ స్పెషల్ ప్రీమియర్ షో సందర్భంగా అల్లు అర్జున్‌ను చూసేందుకు భారీ సంఖ్యలో అభిమానులు తరలిరావడంతో తీవ్ర రద్దీ ఏర్పడింది. ఈ క్రమంలో జరిగిన తొక్కిసలాటలో రేవతి (39) అనే మహిళ మృతి చెందగా, ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై పోలీసులు సమగ్ర దర్యాప్తు జరిపి ఇటీవల నాంపల్లి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. మొత్తం 23 మందిని నిందితులుగా పేర్కొనగా, థియేటర్ యాజమాన్యం, సిబ్బందిని ఏ1 నుంచి ఏ10 వరకు నిందితులుగా చేర్చారు.

## చిన్న పాత్రలతో ప్రారంభమై స్టార్‌గా ఎదిగిన
# సాయి ధన్సిక

**హైదరాబాద్, జూన్ 22**

సినీ పరిశ్రమలో అనేక మంది నటీనటులు చిన్న చిన్న పాత్రలతో కెరీర్ ప్రారంభించి, సంవత్సరాల కృషి తర్వాత ప్రధాన పాత్రల్లో స్థిరపడిన ఉదాహరణలు ఉన్నాయి. హీరోలు మాత్రమే కాకుండా హీరోయిన్లు కూడా ఇలాంటి కష్టతరమైన ప్రయాణం ద్వారా స్టార్ స్థాయికి చేరుకున్న సందర్భాలు ఎన్నో కనిపిస్తాయి. ప్రారంభంలో సైడ్ ఆర్టిస్టులు లేదా డాన్సర్లుగా పనిచేసిన వారు కూడా తర్వాత కాలంలో ప్రముఖ నటీనటులుగా ఎదిగారు. ఈ క్రమంలో త్రిష, కాజల్ అగర్వాల్ వంటి స్టార్ హీరోయిన్లు కూడా కెరీర్ ప్రారంభంలో చిన్న పాత్రల్లో నటించి, ఆ తర్వాత అగ్ర హీరోయిన్ స్థాయికి చేరుకున్నారు. ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటోలో కనిపిస్తున్న బ్యూటీ కూడా అలాంటి ప్రయాణమే చేసిన నటి అని సమాచారం. ఆమె మరెవరో కాదు తమిళ నటి సాయి ధన్సిక. 2006లో సినీ రంగ ప్రవేశం చేసిన ఈ ముద్దుగుమ్మ ప్రారంభంలో తమిళ సినిమాల్లో చిన్న చిన్న పాత్రలతోనే కెరీర్‌ను కొనసాగించింది. అయితే ఆరంభంలో పెద్దగా గుర్తింపు రాలేదు. అయినప్పటికీ 2016లో సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన ‘కబాలి’ చిత్రంలో ఆయన కుమార్తె పాత్రలో నటించి మంచి గుర్తింపు సంపాదించింది. ఆ సినిమా ఆమె కెరీర్‌కు పెద్ద మలుపుగా మారి ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది.



## సోషల్ మీడియాకు
# కయాదు విరామం

**హైదరాబాద్, జూన్ 22**

యువతలో మంచి క్రేజ్ సంపాదించుకున్న కథానాయికల్లో కయాదు లోహర్ ఒకరు. తెలుగు, తమిళ చిత్రాలతో వరుస అవకాశాలు అందుకుంటూ బిజీగా కొనసాగుతున్న ఈ అందాలభామ.. తాజాగా సోషల్ మీడియాకు కొంతకాలం దూరంగా ఉండాలని నిర్ణయించుకుంది. ఈ విషయాన్ని ఆమె స్వయంగా తన సామాజిక మాధ్యమ ఖాతా ద్వారా అభిమానులతో పంచుకుంది. ‘సామాజిక మాధ్యమాల నుంచి ఒక అడుగు వెనక్కి వేస్తున్నాను. శరీరానికి విశ్రాంతి ఎంత అవసరమో, మనసుకు కూడా అంతే అవసరం. నాతో నేను మరింత సమయం గడపాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నాను. ఇప్పటివరకు నాకు అండగా నిలిచిన అందరికీ ధన్యవాదాలు. మళ్లీ రావాలని అనిపిస్తే తప్పకుండా వస్తాను’ అని కయాదు తన సందేశంలో పేర్కొంది. దీంతో కొంతకాలం పాటు ఈ యువ నటి సోషల్ మీడియాలో కనిపించదన్న విషయం స్పష్టమైంది. వరుస సినిమాలతో బిజీగా ఉన్న సమయంలోనే ఇలా విరామం ప్రకటించడం అభిమానుల్లో చర్చనీయాంశమైంది. ప్రస్తుతం కయాదు లోహర్ నటిస్తున్న చిత్రాల్లో నాని కథానాయకుడిగా తెరకెక్కుతున్న ‘ది ప్యారడైజ్’ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈ చిత్రంలో ఆమె కథానాయికగా నటిస్తున్న సంగతి తెలిసిందే.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467